ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

5

బుధవారం 25 సెప్టెంబరు 2024



ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 32.0

కనిష్ఠం : 26.0



ముసునూరు మండలం చెక్కపల్లి వద్ద కోతకు గురైన రహదారి



అశ్వారావుపేట వాగు వద్ద రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం

- ఏజెన్సీ ప్రాంతంలో పొంగుతున్న వాగులు
- జల్లేరు జలాశయం గేట్లు ఎత్తివేత

బుట్టాయగూడెం/జీలుగుమిల్లి/చింతలపూడి/ముసునూరు/నూజివీడు/పోలవరం సెప్టెంబరు 24: జిల్లాలో పలుచోట్ల మంగళవారం భారీ వర్షం కురిసింది. జోరుతో వాగుల ద్వారా గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయానికి భారీగా నీరు చేరుతోంది. మంగళవారం సాయంత్రం జలాశయం గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఏఈ సురేష్ తెలిపారు. జీలుగుమిల్లి సమీప పి.రాజవరం వంకవారిగూడెం, తాటియాకుల గూడెం గ్రామాల్లో భారీ వర్షంతో పలు చోట్ల వాగులు పొంగి ప్రవహించాయి. అశ్వారావుపేట వాగు, పి.రాజవరం, వంకవారిగూడెం వాగులు రహదారిపై నుంచి ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. ముసునూరు మండలంలో వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రహదారులు నీట మునిగాయి. సంధ్యవాగు ఉధృతితో మనోసారి ప్రధాన రహదారికి గండిపడే ప్రమాదం ఉందని స్థానికులు భయపడుతున్నారు. నూజివీడు మండలం దిగవల్లి నక్కల వాగుకు మూడు చోట్ల గండి పడింది. పోలవరం మండలంలో గూటాల, కొత్త పట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఎల్ఎన్డీపేట, ప్రగడపల్లి గ్రామాలలో కురిసిన వర్షానికి పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

త్యాగాలకు గుర్తింపు

నామినేటెడ్ పదవుల పంపకం.. ఆరంభం

ఉమ్మడి పశ్చిమను వరించిన అదృష్టం

- త్రైకార్ చైర్మన్‌గా బొరగం, వినియోగదారుల రక్షణ కౌన్సిల్ చైర్మన్‌గా సుజాత, ఏపీఐఐసీ చైర్మన్‌గా రామరాజు, టూరిజం డైరెక్టర్‌గా వినోద్
- వెయిటింగ్‌లో అనేక మంది సీనియర్లు
- రెండో జాబితా కోసం ఇప్పటి నుంచే టెన్షన్
- నేడు సీఎం చంద్రబాబుతో కొత్త చైర్మన్‌ల భేటీ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

నామినేటెడ్ పదవుల కోసం కళ్ళు కాయలు కాచేలా చాన్నాళ్ళుగా ఎదురు చూస్తున్న వారిలో కొందరికి మంగళవారం అదృష్టం లభించింది. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన పలువురికి పదవులు లభించాయి. తొలిదశలో మాజీ మంత్రి పీతల సుజాతను ఏపీ రాష్ట్ర వినియోగదారుల రక్షణ కౌన్సిల్ చైర్మన్ గాను, పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామరాజును ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్(ఏపీఐఐసీ) చైర్మన్ గాను, పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌ను ఏపీ ట్రైకార్ చైర్మన్ గాను నియమించారు. కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లికి చెందిన కొడాలి వినోద్‌కుమార్‌కు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి వరించింది. నామినేటెడ్ పదవుల భర్తీకి నెలన్నర క్రితమే ప్రభుత్వపరంగా కసరత్తు ఆరంభమైంది. గడిచిన ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడి సీట్ల కేటాయింపులో ఎందరో త్యాగాలకోర్చారు. పార్టీ ఆదేశాలకు తలొగ్గారు. ఐదేళ్లపాటు కష్టపడి ఆర్థికంగా, మానసికంగా ఒత్తిడికి గురైన వారెందరో. అందరికీ తగు విధంగా గుర్తించి గౌరవిస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే క్రమంలో మంగళవారం తొలి నామినేటెడ్ జాబితాను విడుదల చేశారు.

బొరగం త్యాగానికి దక్కిన గౌరవం

గడిచిన ఎన్నికల్లో పోలవరం స్థానం నుంచి టీడీపీ పక్షాన నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పోటీ చేయాలని భావించారు. పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తగు రీతిలో గౌరవిస్తామని అప్పట్లోనే పార్టీ అధినేత చంద్రబాబు బొరగంకు భరోసా ఇచ్చారు. అన్నట్టుగానే గిరిజన సంక్షేమానికి అత్యంత కీలకమైన ట్రైకార్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. వాస్తవానికి బొరగంకు ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి లభిస్తుందని ప్రచారం సాగింది. గతంలో ఇదే నియోజకవర్గానికి చెందిన వైసీపీ ఎమ్మెల్యే బాలరాజుకు కమిషన్ చైర్మన్ పదవిని అప్పగించారు. అదే పదవి బొరగంకు దక్కే అవకాశం ఉందని ప్రచారం సాగినా చివరకు ట్రైకార్ చైర్మన్ పదవి కేటాయించారు. పార్టీకోసం క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా త్యాగాలకోర్చి జనసేన పక్షాన చిర్రి బాలరాజును గెలిపించడంలో ఆయన కృషి కలిసొచ్చింది.

సుజాతను వరించిన అదృష్టం

మాజీ మంత్రి పీతల సుజాతకు అదృష్టం కలిసొచ్చింది. ఆమె 2004లో ఆచంట ఎమ్మెల్యేగా, 2014లో చింతలపూడి ఎమ్మెల్యేగాను గెలుపొంది, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా సేవలందించారు. గడిచిన ఎన్నికల్లో చింతలపూడి నుంచి పోటీకి ప్రయత్నించినా మాదిగ, మాల సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని ఆమెను కాదని రోషన్‌కుమార్‌కు టికెట్ ఇచ్చారు. అయినా సుజాత పార్టీ ఆదేశాల ప్రకారం మంగళగిరిలో లోకేశ్ పక్షాన ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి వైసీపీపై తరచూ విరుచుకుపడేవారు. ఇవన్నీ ఆమెకు కలిసి రావడమే కాకుండా పార్టీకి మొదటి నుంచి విధేయురాలిగా ఉండడం, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మహిళా నేతై ఉండడం ఆమెకు మంచి మార్కులు లభించాయి.

టూరిజం డైరెక్టర్‌గా వినోద్



ముదినేపల్లికి చెందిన కొడాలి వినోద్‌కుమార్‌కు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో డైరెక్టర్‌గా నియమించి తగు ప్రాధాన్యత ఇచ్చారు. పార్టీకే అంకితమై పనిచేస్తున్న బీసీ వర్గానికి చెందిన వినోద్‌కు ఈ ఛాన్స్ దక్కడం విశేషం. కార్పొరేషన్ల చైర్మన్‌లుగా ఎంపికైన వారందరితో బుధవారం సీఎం చంద్రబాబు తన స్వగృహంలో భేటీ కానున్నారు. వీరందరికీ దిశ, దశ నిర్దేశం చేయడమే కాకుండా మలి విడత జాబితా ఎలా ఉండబోతుందో సంకేతాలు ఇచ్చే అవకాశం ఉంది.

సిట్టింగ్ స్థానాన్ని వదులుకుని..



గడిచిన ఎన్నికల్లో నర్సాపురం పార్లమెంట్ స్థానాన్ని అప్పటి సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణరాజు ఆశించినప్పటికీ, అది దక్కకపోవడంతో ఉండి ఎమ్మెల్యే టిక్కెట్‌ను కేటాయించారు. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు ఎమ్మెల్యే అభ్యర్థిగా జోరుగా ప్రచారం చేస్తున్నారు. అయితే అధిష్ఠానం ఆదేశాల మేరకు సీటును త్యాగం చేశారు. రామరాజు భవిష్యత్‌కు చంద్రబాబు భరోసా ఇచ్చారు. దీనికి కట్టుబడి ఇప్పుడు రాష్ట్రంలోనే కీలకమైన ఏపీఐఐసీ చైర్మన్ పదవి కట్టబెట్టారు. రామరాజు వైసీపీ హవా వున్న 2019లోనే ఉండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. త్యాగంతోనే కార్పొరేషన్ పదవి దక్కింది.

త్యాగాలకోర్చి.. ఎన్నో ఆశలతో..

గడిచిన ఐదేళ్లలో పార్టీనే నమ్ముకుని నిత్యం వైసీపీతో యుద్ధం చేయడమే కాకుండా అక్రమ కేసులకు వెరవకుండా, ధైర్యం సడలకుండా పనిచేసిన నేతలు, కార్యకర్తలు ఉమ్మడి పశ్చిమలో ఎందరో ఉన్నారు. గడిచిన ఎన్నికల్లో పొత్తు ధర్మం పాటించడమే కాకుండా త్యాగాలకోర్చిన వారు మరెందరో. ఉంగుటూరు నుంచి పోటీ చేయాలనుకున్న ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించి అక్కడి నుంచి పత్సమట్ల ధర్మరాజును గెలిపించే బాధ్యతను మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుకు అప్పగించారు. మీకు భవిష్యత్తులో ఎమ్మెల్సీ లేదా అత్యంత గౌరవమైన పదవి కట్టబెట్టడమే కాకుండా పార్టీ అన్నింటా సానుకూలంగా ఉంటుందంటూ టీడీపీ అధినాయకత్వం ప్రకటించింది. ఏలూరు జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు కొనసాగించాల్సిందిగా గన్నిని కోరింది. ఇప్పుడు ఎమ్మెల్సీ అవకాశాల కోసం గన్ని ఎదురు చూస్తున్నారు. ఒకప్పుడు మంత్రిగా ఓ వెలుగు వెలిగి అప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీనే నమ్ముకున్న మాజీ మంత్రి జవహర్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పించడమే కాకుండా నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇస్తారని మొదటి నుంచి భావిస్తున్నారు. జవహర్ దూకుడుతనం, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో ఆయనకు తగురీతిలో ప్రాధాన్యత ఇవ్వాలని అనుకుంటున్నా తొలి జాబితాలో మాత్రం ఆయనకు చోటు దక్కలేదు. తాడేపల్లిగూడెం నుంచి పోటీ చేసేందుకు, పార్టీనే నమ్ముకుని నిత్యం కష్టపడిన నియోజకవర్గ కన్వీనర్ వలవల బాబ్జీకి తగు రీతిలో గౌరవం ఇచ్చే పదవిలో నియమిస్తామని ఎన్నికలకు ముందే పార్టీ భరోసా ఇచ్చింది. తాడేపల్లిగూడెం స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో అక్కడి నుంచి పోటీ చేసేందుకు అవకాశం లేక బాబ్జీ ఆనాడు త్యాగాలకోర్చారు. నరసాపురం నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించడంతో అక్కడ టీడీపీ నుంచి పోటీ చేయాలని ఆశించిన పార్టీ కన్వీనర్ రామరాజు, మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడుకి సైతం అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద పీట వేస్తామంటూ టీడీపీ నాయకత్వం భరోసా ఇచ్చింది. తొలి జాబితాలో మాత్రం వీరెవరికీ అవకాశం రాలేదు. నిడదవోలు నుంచి పలుమార్లు గెలిచిన సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సైతం ఈ స్థానాన్ని గత ఎన్నికల్లో జనసేనకు కేటాయించడంతో ఆయన త్యాగానికి తలొగ్గారు.

ఇలా సీనియర్లు పొత్తు ధర్మానికి కట్టుబడి పోటీ నుంచి వైదొలిగి త్యాగానికే సిద్ధపడ్డారు. వీరందరూ అవకాశాల కోసమే ఇప్పటికీ వెయిటింగ్‌లో ఉన్నారు. ఎవరైతే పొత్తులో భాగంగా పోటీ చేసే అవకాశం కోల్పోయి ఉన్నారో వారందరికీ కచ్చితంగా ఏదో రూపంలోన్యాయం చేస్తామన్న టీడీపీ భరోసా రెండో జాబితాలోనైనా నెరవేరుతుందేమోనన్న ఆశతోనే ఈ నేతలు, కేడర్ ఉన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో దాదాపు 20 మందికిపైగా సీనియర్లు వివిధ కార్పొరేషన్‌లలో డైరెక్టర్ స్థాయి పదవుల ను ఆశిస్తున్నారు. వీరంతా తొలి జాబితాలోనే తమకు గుర్తింపు లభించక పోతుందా అని ఇప్పటిదాకా ఎంతో ఆశతో ఉన్నారు. కాని తొలి నామినేటెడ్ పోస్టుల జాబితా మాత్రం వీరందరికీ దిమ్మ తిరిగేలా చేసింది.

కష్టానికి తగిన ఫలితం



పార్టీని నమ్మి కష్టించి పనిచేస్తే పార్టీ అధినేత చంద్రబాబు తప్పక గుర్తిస్తారు. అవసరం వచ్చినప్పుడు తగిన గౌరవం ఆయనే కల్పిస్తారు. గత ఎన్నికల్లో నాకు సీటు కేటాయించకపోయినా ఏం బాధపడలేదు. పార్టీ విజయం కోసం నాయకత్వం చెప్పినట్టే వ్యవహరించి ప్రచారంలోనూ పాల్గొన్నా. పడిన కష్టానికి నామినేటెడ్ పదవి ఇచ్చి ఆదరించారు. పార్టీ క్రియాశీలక వ్యవహారాల్లోను, ప్రభుత్వ విధానాల్లోను పాలు పంచుకునే అవకాశం కల్పించారు. నేనెప్పటికీ సీఎం చంద్రబాబు, లోకేశ్‌కు విధేయురాలినే. నామినేటెడ్ పదవి కల్పించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు. భువనేశ్వరి ఆశీస్సులు లభించడం శుభపరిణామం.

- పీతల సుజాత, రాష్ట్ర వినియోగదారుల రక్షణ కౌన్సిల్ చైర్మన్

పనిచేసే వారికి గుర్తింపు



టీడీపీ అధినేత చంద్రబాబు ఏ పదవి ఇచ్చినా సంతోషంగా స్వీకరిస్తా. త్యాగానికి తగిన ఫలితం దక్కింది. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుంది. అందుకు నేనే ఉదాహరణ. ట్రైకార్ చైర్మన్‌గా నియ మించడం సంతోషంగా వుంది. చంద్రబాబుకు కృతజ్ఞతలు. క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తా. క్షేత్రస్థాయిలో ప్రతి కార్యకర్తను కలుపుకుని అందరి సహకారం, సమన్వయంతో ముందుకు సాగుతా.

- బొరగం శ్రీనివాస్, ఏపీ ట్రైకార్ చైర్మన్

రైతు సంతోషంగా ఉండాలి : మంత్రి పార్థసారథి



వరి చేను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి

ఆగిరిపల్లి, సెప్టెంబరు 24: రాష్ట్రంలో ప్రతి రైతు సంతోషంగా ఉండాలని, సాగులో ఆధునిక టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. వ్యవసాయ సాగులో ప్రత్యేక విధానాన్ని రూపొందించేందుకు ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారని మంత్రి అన్నారు. సగ్గూరులో మంగళవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. యువతను వ్యవసాయం వైపు మరల్చేందుకు యంత్రాలు, డ్రోన్ల వినియోగం, కృత్రిమ మేధస్సు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. రైతులు సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం 50 శాతం వరకు సబ్సిడీ అందిస్తోందని మంత్రి తెలిపారు. వ్యవసాయ పరిశోధనలు క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడే సార్థకత చేకూరుతుందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటించి సాగులో మెళకువలు, ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతలు త్వరలోనే పూర్తిచేసి నూజివీడు ప్రాంత రైతుల సాగు, తాగునీటి కష్టాలను తీరుస్తామని మంత్రి సారధి చెప్పారు. డ్రోన్‌ల ద్వారా పొలాల్లో ఎరువులు, పురుగుమందులు చల్లడాన్ని మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.భవానిశంకరి, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారులు హబీబ్ బాష, డాక్టర్ నెహ్రూబాబు, ఉద్యానవనశాఖ డీఈ రామ్మోహన్, ఏవో చాముండేశ్వరి, తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

3 నుంచి 21 వరకు టెట్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 24: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్-2024)ను అక్టోబరు 3 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్టు డీఈవో అబ్రహం మంగళవారం తెలిపారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో రోజుకు రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. వట్లూరు సిద్ధార్థ సీబీఎస్ఈ స్కూలులో 3 నుంచి 21 వరకు జరిగే పరీక్షలకు 5470 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉందన్నారు. మరో కేంద్రం సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల (200 మంది అభ్యర్థులు)లో అక్టోబరు 6న ఒక్కరోజు మాత్రమే పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులకు హాల్‌టిక్కెట్లను విడుదల చేసినట్లు తెలిపారు. వివరాలకు 83281 86618, 90307 23444 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

సమ్మెలో ఉన్న వైద్యాధికారులకు జీతం యధాతథం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 24: పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో 30శాతం సీట్ల ఇన్‌సర్వీస్ కోటాపై గ్రామీణప్రాంత పీహెచ్‌సీల వైద్యాధికారుల సమ్మె కొనసాగుతోంది. గైర్హాజరు రోజులకు సెప్టెంబరు జీతభత్యాల్లో కోత విధించాలని జారీచేసిన ఉత్తర్వులను సవరించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ మంగళవారం సవరణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 17 నుంచి సమ్మెలో పాల్గొంటున్న వైద్యాధికారుల్లో ఎవరికీ సెప్టెంబరు జీతభత్యాల్లో కోత విధించవద్దని ఉత్తర్వులు జారీ అయ్యాయి. పీహెచ్‌సీల డీడీవోలు సెప్టెంబరు జీతభత్యాల బిల్లులను పంపాలని ఏపీ సీఎఫ్ఎంఎస్ సీఈవోకు డైరెక్టర్ పంపిన లేఖ నకళ్లను వైద్యాధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణ చంద్రకుమార్ విడుదల చేశారు. జిల్లాలో సమ్మెలో పాల్గొన్న వైద్యాధికారుల సంఖ్య 102కి పెరిగింది.

నూజివీడు డీఎస్పీగా కేవీవీఎన్‌వీ ప్రసాద్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 24: రాష్ట్రంలో పది మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ సీఎస్‌బీ డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్‌ను నూజివీడు డీఎస్పీగా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఎం.సుధాకరరావును ఏలూరు జిల్లా ఇంటిలిజెన్స్ డీఎస్పీగా నియమించారు.

స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి

ఏలూరు సిటీ, సెప్టెంబరు 24: స్వర్ణాంధ్ర 2047 సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తిచేశారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌కు తీసుకోవాల్సిన చర్యలపై స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహణపై జిల్లా అధికారులతో మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. విభిన్న రంగాల్లో ప్రతిభావంతులు, సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు సూచనలు, సలహాలతో స్వర్ణాంధ్ర సాధనలో పాలు పంచుకోవాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేసి, ఫోన్ నెంబరు, ఈ-మెయిల్ ఇతర వివరాలు పొందుపర్చి అభిప్రాయాలు పంచుకోవాలని కోరారు.

ఐటీడీఏలో ప్రతి సోమవారం గిరిజన దర్బార్

బుట్టాయగూడెం, సెప్టెంబరు 24: గిరిజన సమస్యల పరిష్కారానికి కేఆర్ పురం ఐటీడీఏలో ప్రతి బుధవారం జరిగే గిరిజన దర్బార్‌ను ఇక నుంచి సోమవారం నిర్వహిస్తామని పీవో, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మంగళవారం తెలిపారు. ప్రతి సోమవారం మండల, జిల్లా స్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)తో పాటు ఐటీడీఏలో గిరిజన దర్బార్ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్పును ఏజెన్సీ మండలాల్లోని ప్రజలు ప్రజాప్రతినిధులు గుర్తించాలని తెలియజేశారు.

పరిశ్రమల కేంద్రంలో మరికొన్ని బదిలీలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 24: జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ)లో మరి కొందరు అధికారులు, ఉద్యోగులను బదిలీచేస్తూ పరిశ్రమల శాఖ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. డీడీ ఎన్.అరుణ కర్నూలు డీఐసీకి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కమిషనరేట్‌లో డీడీగా పనిచేస్తున్న పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు నియమితులయ్యారు. ఏడీ సుమధుర వాణి బాపట్ల బదిలీ అయ్యారు. ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్లు (ఐపీవో) వైఎస్.భూపాల్ మచిలీపట్నం, కె.యువరామ్‌కిశోర్ మంగళగిరి డైరెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. కాకినాడ ఐపీవో పీబీఎస్.దొరను ఇక్కడ నియమించారు. డీఐసీ కార్యాలయ సూపరింటెండెంట్ పి.కిరణ్‌కుమార్‌ను ఎన్టీఆర్ జిల్లా బదిలీ అయ్యారు. సీనియర్ అసిస్టెంట్ ఎస్ఎం.ఫజీలుల్లాను కాకినాడ డీఐసీకి, అక్కడి నుంచి కె.కిరణ్మయి ఏలూరు బదిలీ అయ్యారు.

వరద సహాయక చర్యల్లో అధికారుల పాత్ర ఎనలేనిది


అధికారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్, తదితరులు

పెదపాడు, సెప్టెంబరు 24 : వరదల బాధితులకు సకాలంలో సహాయక చర్యలు చేపట్టడంలో అధికారుల పాత్ర ఎనలేనిదని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దారు ప్రసాద్‌బాబు, వైద్యులు చక్రధర్, వాణిసంధ్యశ్రీ, ఈవోలు పద్మారావు, రాజేష్, వీఆర్వోలు ప్రసాద్ కరీముల్లా, మురళీలతో పాటు పలువురిని ఎమ్మెల్యే చింతమనేని కూటమి నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. యు.రాంప్రసాద్, జి.స్టాలిన్, ఎం.శ్రావణి, జి.అనిల్, ఎ.వంశీకృష్ణ, ఎల్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక స్థైర్యం పెంచుకోవాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 24: ఆర్గనైజేషన్ ఆఫ్ హ్యూమానిటీ ఆధ్వర్యంలో శనివారపుపేట పరివర్తన్‌లో ఏడేఆఫ్ ఫన్‌అండ్ కమ్యూనికేషన్ విత్ డఫ్‌అండ్‌మాన్ నెరబుల్ చిల్డ్రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెవిటి, మూగ విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. అలాగే సైన్స్ లాంగ్వేజ్, ఇన్‌స్ట్రాక్షన్ కార్యక్రమం నిర్వహించి, వారిలో మానసిక స్థైర్యాన్ని పెంచే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సీజీవీ ఆర్.సందీప్, సిహెచ్ శ్రీనివాస్, మోహన్, తరుణ్, సత్య హేమంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 24 : ఎదుటి వ్యక్తుల ప్రవర్తనను గమనించి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లాలోని పోలీసు అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థినులకు సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులలో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన, సైబర్ నేరాలపై అవగాహనను కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి : సీఐ సత్యనారాయణ

దుకాణాల సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఏలూరు వన్‌టౌన్ సీ ఐ జి.సత్యనారాయణ సూచించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐ, ఎస్‌ఐ మదీనాబాషా వారి సిబ్బంది కలిసి ఏలూరు బులియన్ మర్చంట్ కల్యాణమండపంలో వాణిజ్య వర్తక సంఘాల వారితో సమావేశం మంగళవారం నిర్వహించారు. నేర నియంత్రణ కోసం పోలీసులు చేపట్టిన చర్యలను ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్వీట్ షాపుల్లో తనిఖీలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 24 : స్వీట్స్ తయారీకి కృత్రిమ రంగులు కలుపుతున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్సు ఎస్పీ వి.శ్రీరాంబాబుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ ఎమ్మార్వో పి.కన్యాకుమారి, విజిలెన్స్ ఏవో పి.సురేష్, ఆహార తనిఖీ అధికారి కావ్యారెడ్డి, లీగల్ మెట్రాలజీ అధికారి వాసుదేవరావు బృందం కైకలూరులోని శ్రీశ్యామలా స్వీట్స్, శ్రీనాగ శ్రీస్వీట్స్ అండ్ బ్రేకరీ, ఎస్‌ఆర్ ఎస్ స్వీట్స్, వెంకట శ్యామల స్వగృహ ఫుడ్స్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అక్కడ తినుబండారాల నాణ్యతను పరిశీలించి శాంపిల్స్‌ను లేబరేటరీకి పంపించారు. అంతేకాకుండా ఫుడ్ ప్యాకింగ్ సర్టికెట్ లేని షాపులపై లీగల్ మెట్రాలజీ అధికారులు కేసులు నమోదు చేశారు.

అసైన్డ్ భూమి కబ్జా చేసిన వైసీపీ నాయకులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 24: ప్రభుత్వం తమకు అసైన్డ్‌భూమి కేటాయిస్తే ఆ భూమిని కొంతమంది వైసీపీ నాయకులు కబ్జాకు చేశారని న్యాయం చేయాలంటూ కామవరపుకోట మండలం రత్నగిరినగర్‌కు చెందిన బాధితులు కలెక్టర్ వెట్రిసెల్వికి మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా బాధితులు శ్రీరాములు, సోమయ్య, ఎం.వీరవెంకయ్య తదితరులు మాట్లాడుతూ రత్నగిరిలో వ్యవసాయ అసైన్డ్ భూమిని తమకు ఇచ్చిందన్నారు. తేలాయిగూడెం అత్తిలి గ్రామానికి చెందిన వ్యక్తులు తమ భూమిని ఆక్రమించడంతో పాటు పత్రాల్లో చేర్పులు, మార్పులు చేసి తమను మోసం చేశారని ఆరోపించారు. తమ భూమి తమకు ఇప్పించాలని పొలం కబ్జా చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలంటూ వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

టీచరు సెలవుపై విచారణ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 24 : నిబంధలనలకు విరుద్ధంగా ఓ ఉపాధ్యాయునికి విషయంలో వివాదాస్పద నిర్ణయాలపై పాఠశాల విద్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఏలూరు డీఈవో కార్యాలయంలో విచారణ జరిగింది. భీమడోలు మండలంలోని ఓ హైస్కూలులో 2014లో టీచరు సెలవు పెట్టినప్పటి నుంచి 2021లో కామవరపుకోట మండలంలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుని పెన్షన్ నిమిత్తం ప్రతిపాదనలు పంపినపుడు ఈ విషయాలన్ని వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విచారణను కాకినాడ ఆర్జేడీ నాగమణి నిర్వహించాల్సి ఉండగా, ఆమె రాకపోవడంతో సంబంధిత ఫైళ్ల పరిశీలనకే పరిమితమయ్యారు.

టీచర్ల 'పని సర్దుబాటు'పై యూటీఎఫ్ దుమారం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 24 : నిబంధనలకు విరుద్ధంగా ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు సర్‌ప్లస్ టీచర్లకు ఇటీవల జరిగిన వర్క్ అడ్జస్టిమెంట్ కౌన్సెలింగ్‌లో సర్దుబాటు స్థానాలను కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ యూటీఎఫ్ నగర శాఖ నాయకులు మంగళవారం ఏలూరు ఇన్‌చార్జి డీవైఈవో, ఎంఈవో-1 ప్రకాష్, ఎంఈవో-2 రంగయ్యలకు ఫిర్యాదు చేశారు. పని సర్దుబాటు కౌన్సెలింగ్‌లో కొందరు టీచర్లు ఎంచుకున్న పాఠశాలల్లో విధులు చేపట్టకుండా వేరే పాఠశాలల్లో ఎలా జాయిన్ అవుతారో రాతపూర్వక వివరణకు డిమాండ్ చేశారు. ఫిర్యాదు కాపీలను యూటీఎఫ్ నగరశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్కే పర్వీన్‌బేగం, జె.రాజారావు ఇక్కడి పత్రికలకు విడుదల చేశారు. వర్క్ అడ్జస్టిమెంట్‌లో జరిగిన అవతవకలను సరి చేయని పక్షంలో ఉన్నతాధికారులకు తెలియజేసి, త్వరలోనే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు.

నిబంధనల ఉల్లంఘన జరుగలేదు : డీఈవో వివరణ

ఏలూరు అర్బన్ పరిధిలో పనిచేస్తున్న ఏడుగురు టీచర్ల వర్క్ అడ్జస్టిమెంట్ స్థానాల మార్పిడి నిబంధనలకు అనుగుణంగానే జరిగాయని డీఈవో అబ్రహం తెలిపారు. నలుగురు టీచర్లు పరస్పర అంగీకారంతో స్థానాలు మార్చుకునేందుకు అనుమతి తీసుకున్నారు. మరో ముగ్గురు ఉపాధ్యాయులను నిబంధనల మేరకు అర్బన్ పరిధిలోనే సర్దుబాటు చేశామన్నారు. మండల, అర్బన్ పరిధిలో ఎక్కడైనా టీచరు కొరత ఉంటే అక్కడకు సర్దుబాటుపై ఆదే మరో ఉపాధ్యాయుడిని నియమించుకునేందుకు ఎంఈవోకు అధికారం ఉంటుందన్నారు. దీనికి వర్క్ అడ్జస్టిమెంట్ నిబంధనలు అడ్డుకావని వివరించారు.

దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవాలి

లింగపాలెం, సెప్టెంబరు 24: యాదవ సామాజిక వర్గానికి చెందిన ఓ కుటుంబంపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా యాదవులంతా ఉద్యమం చేపడతామని యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాట్రు బాలు హెచ్చరించారు. ముడిచర్లలో గోల శ్రీనుపై తోటలో మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి దాడిచేయడంతో ప్రాణాపాయ స్థితిలో ఏలూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. యాదవ సంఘం నేతలు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే మద్దిపాటి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 24: ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా పని చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తానని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మారంపల్లి, జాజుల కుంట, రాజుపాలెం, తిరుమలం పాలెం, గొల్లగూడెం, పి.కన్నా పురం, తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పలు సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. టీడీపీ నాయకులు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీనివాసరావు, డీపీఎస్ చౌదరి, నాదెళ్ల సురేంద్రనాథ్ చౌదరి,తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ మినహాయింపు ఇవ్వాలి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 24 : రెండున్నరేళ్లుగా మున్సిపల్ ఉపాధ్యాయుల జీత భత్యాల నుంచి పీఎఫ్ మినహాయంపులు జరపకుండా నిలిపి వేయడాన్ని తప్పుబడుతూ, తక్షణమే డీఈవో ఈ సమస్యను పరిష్కరించాలని మంగళవారం ఏలూరులో జరిగిన ఏపీటీఎఫ్ జోనల్ సమావేశంలో ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్లకు ఐదేళ్లుగా పదోన్నతులులేవని, వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కొత్త పీఆర్సీ ఇప్పటికే ఆలస్యమైనందున తక్షణమే ఐఆర్‌ను ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలు కాపాడడమే కూటమి లక్ష్యం


కామవరపుకోట మండలం ఆడమిల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

కామవరపుకోట, సెప్టెంబరు 24 : రైతుల ఆర్థిక పురోభివృద్ధికి చేయూతనిచ్చి వారికి రాయితీలు, వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం, రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పేర్కొన్నారు. ఆడమిల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కేవీ సుబ్బారావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు జి.సుధీర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం : ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెడుతుందని వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. యడవల్లి, తువ్వచిలుకరాయుడు పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఎం.మల్లిఖార్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : తెగుళ్ల నివారణకై, వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు వాడాలని ఏవో డి.ముత్యాలరావు సూచించారు. బుట్టాయగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. సర్పంచ్ టి.వెంకాయమ్మ, ఉప సర్పంచ్ కె.శ్రీను, మల్బరీశాఖ అధికారి పి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : నాచుగుంట, ఉంగుటూరులలోని వ్యవసాయ క్షేత్రాలలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో తూటిపత్ర కషాయం తయారీ, పిచికారీ విధానాన్ని రైతులకు ఏవో ఎస్ఎస్ ప్రవీణ్ కుమార్ వివరించారు. ఎంపీటీసీ జి.ఉషారాణి, సర్పంచ్ భర్త ఎ.సురేష్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ అడ్వయిజర్ బి.సంధ్యారాణి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

● పెదపాడు : వరిలో పంటలకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణా చర్యలపై రైతులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ఏవో వి.ప్రదీప్ కుమార్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగు, పురుగు మందుల పిచికారీ, సేంద్రీయ, కషాయ ఎరువులు, పురుగు మందుల తయారీపై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయ, పశు సంవర్ధక, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. కె.లక్ష్మణమోహన్, సూరారెడ్డి, వెటర్నరీ అధికారి కిరణ్, గోవిందరాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

● పెదవేగి : ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో ఎం.ప్రియాంక సూచించారు. తాళ్లగోకవరంలో పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను ఉద్యానవనశాఖ అధికారులు తెలిపారు. సర్పంచ్ సురేష్‌బాబు, ఎంపీటీసీ రాజారత్నం పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : చొదిమెళ్ళ, మల్కాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో జీవనసంధ్య వరి సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడి సాధించే లక్ష్యంగా రైతులకు అవగాహన కల్పించారు.

● జంగారెడ్డిగూడెం : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయం, అనుబంధ రంగాలు పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో కేవీఎస్ పోశారావు, తహసీల్దారు కె.స్లీవజోజి, ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలకృష్ణ, టీడీపీ, బీజేపీ, జనసేన మండల అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ, కె.మాధవరావు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

● కుక్కునూరు : మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయం వద్ద పొలంపిలుస్తోంది పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ సిబ్బందితో కలిసి రైతులంతా పొలం వద్దకు వెళ్లారు. పంట దిగుబడి ఏవిధంగా పెంచాలి, సాగుమెలకువలు, సోలార్ పద్ధతులతో వ్యవసాయం ఎలా చేయాలనే అంశాల పై వ్యవసాయాధికారి బాలాజీ రైతులకు వివరించారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు కె.సత్యనారాయణ, పి.శ్రీను, ఎం.రమణయ్య, బాలాజీ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, బీజేపీ నాయకులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● వేలేరుపాడు : మేడేపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏవో పి.సమీర తక్కువ పెట్టుబడితో తక్కువ రసాయనాలు వాడి లాభసాటి దిగుబడి ఎలా పొందవచ్చో రైతులకు వివరించారు. తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, కూటమి నాయకులు జి.ఆదినారాయణ, సీహెచ్. శ్రీనివాసరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం : వల్లంపట్లలో ఏవో బి.సుమలత ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. వెటర్నరీ అసిస్టెంట్ ప్రవాంతి, వినీల, మణికంఠ, రైతులు పేరుబోయిన శ్రీనివాస్, చవల అప్పలరాజు, శింగంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : పొలం పిలుస్తోంది కార్యక్రమాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో చెన్నకేశవులు కోరారు. అచ్యూతపురం, పొంగుటూరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది నిర్వహించారు. ప్రతి మంగళ, బుధవారాలు పొలం పిలస్తుంది కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

● భీమడోలు : కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. కురేళ్ళగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమా నికి ఆయన హాజరయ్యారు. వ్యవసాయ శాఖ పాడి పరిశ్రమల ద్వారా లభిస్తున్న పథకాలను సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు.

● చింతలపూడి : రాఘవాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రాఘవాపురం, గణిజర్ల గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో వివిధ శాఖలు అందించే సౌకర్యాలు, పథకాలపై ఆయా శాఖల అధికారులు వివరించారు. ఏవో కె.మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

'బొరగం'కి టీడీపీ నాయకుల అభినందనలు


శ్రీనివాసును అభినంధిస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్


బొరగంశ్రీనివాసును అభినందిస్తున్న బుట్టాయగూడెం నాయకులు


శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న టి.నరసాపురం నాయకులు

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 24: ఏపీ ట్రైకార్ చైర్మన్‌గా నియమితులైన బొరగం శ్రీనివాస్‌కు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందనలు తెలిపారు. ఏలూరు ఎంపీ కార్యాలయంలో శ్రీనివాస్ ఎంపిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఏలూ రు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడు తూ తెలుగు దేశం పార్టీకి మొదటి నుంచి అంకితభావంతో శ్రీనివాస్ పని చేశారన్నారు. ట్రైకార్ చైర్మన్‌గా నియమితులు అవడంపై హర్షం వ్యక్తం చేశారు.

● టి.నరసాపురం : ఏపీ ట్రైకార్ చైర్మన్‌గా నియమితులైన పోల వరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాసులను తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వాసిరెడ్డి రామ్మోహన్, టీడీపీ నాయకులు మంగళవారం అభినందించారు. ప్రభుత్వం ప్రకటించిన వివిధ కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో పోలవరం నియోజ కవర్గ టీడీపీ కన్వీనర్‌గా పనిచేస్తున్న బొరగం శ్రీనివాస్‌కు ఏపీ షెడ్యూల్ తెగల సహకార ఆర్థిక కార్పొరేషన్ (ట్రైకార్) చైర్మన్‌గా నియమిం చడంపై హర్షం వ్యక్తం చేశారు. గండబోయిన శ్రీను, పలువురు ఉన్నారు.

● బుట్టాయగూడెం : ట్రైకార్ చైర్మన్‌గా ఎన్నికైన బొరగం శ్రీనివాస్‌కు య.శ్రీనివాసరావు, ఎం.సోంబాబు, జి.అబ్బులు, మురళికృష్ణ, ఎ.ఫణికిశోర్ అభినందనలు తెలిపారు.

● జంగారెడ్డిగూడెం : టీడీపీ విధేయులకు రాష్ట్ర స్థాయి పదవులను ఇచ్చి గౌరవించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ఆ పార్టీ నేత షేక్ ముస్తఫా, వి.హరికృష్ణ, ఎన్.రామచంద్రరాజు, టి.దుర్గా రావు, పి.ఫణిశర్మ, యు.ఏడుకొండలు, కె.నాగు మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

● కుక్కునూరు : ట్రైకార్ చైర్మన్‌గా ఎన్నికైన బొరగం శ్రీనివాస్‌కు మండల టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, పులి శ్రీను, ఉదయ్, చుంచు సత్యనారాయణ, తదితరులు ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

● వేలేరుపాడు : ట్రైకార్ చైర్మన్‌గా ఎన్నికైన బొరగం శ్రీనివాస్‌కు జనసేన మండల అధ్యక్షుడు గణేశుల ఆదినారాయణ, నాయకులు మేచినేని సంజయ్, పొట్ల మోహన్, సుధాకర్, శివరామ్, వంశీ హర్షం వ్యక్తం చేశారు.

● పోలవరం : టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులుకి ట్రైకార్ చైర్మన్ పదవి కేటాయింపుపై టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. పోలవరంలో ఆయన నివాసం వద్ద నాయకులు శ్రీనివాసులు దంపతులకు శాలువా కప్పి కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. నాయకులు బొడ్డు కృష్ణ, మొగపర్తి సోంబాబు, డోకల నాగేశ్వరరావు, గుబ్బా రాంబాబు, వినోద్, పాదం ప్రసాద్, కోడి పోసి, సోమరౌతు ప్రళయమూర్తి, ఇ.సత్యనా రాయణ, కొండే యేసు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : పార్టీ కోసం కష్టపడ్డ వాడికి కూటమి ప్రభుత్వంలో తగిన గుర్తింపు లభిస్తుందని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. ఆయన కన్నాపురం చేరుకోవడంతో కూటమి నాయకులు ఆయన్ని అభినందించారు. ప్రధాన సెంటర్‌లోని వినాయక ఆలయంలో ఆయన్ని ఘనంగా సత్కరించారు. బొమ్మా గంట్లయ్య, ఎంపీటీసీలు షేక్ బాజీ, గణపతి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి


గుండుగొలనులో ఎమ్మెల్యే ధర్మరాజు ర్యాలీ


శ్రీరామవరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

అన్ని వర్గాలకు ఇది మంచి ప్రభుత్వం

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 24: ప్రజల భవిష్యత్తుకు భరోసా కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చేసి జీవన ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 12వ డివిజన్ దక్షిణపు వీధిలో కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, టీడీపీ పరిశీలకులు ఎస్కే.మీర, నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, జనసేన అధ్యక్షులు కాశీనరేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాది రాంబాబు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, మాజీ మున్సిపల్ చైర్మన్ ఉప్పాల జగదీష్‌బాబు, కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు : గుండుగొలనులో నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ధర్మరాజు పర్యటించారు. కరపత్రాలు అంద జేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : ఇచ్చిన అన్ని హామీలు కూటమి ప్రభుత్వం నెరవేరుస్తూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మాదేపల్లిలో మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు ఎం.రవి, ఎస్. నాగరాజు, ఎస్.సత్యనారాయణ, రఘు తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్నివర్గాలకు ఉపయోగపడే మంచి ప్రభుత్వమని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి మద్దతు తెలిపి కలెక్టరేట్ వద్ద వేడుక నిర్వహించారు.

● చింతలపూడి : ఎర్రగుంటపల్లిలో జడ్పీటీసీ మాజీ సభ్యులు టి.రాధారాణి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించారు. ఆమె వంద రోజుల పరిపాలనలో సంక్షేమం, అభివృద్ధి, సాధించిన విజయాలపై గ్రామస్తులకు వివరించి కరపత్రాలు అందచేశారు. ఎంపీటీసీ విజయభాస్కర్, టీడీపీ నాయకులు వైవీ సత్యనారా యణ, వెంకటేశ్వరరెడ్డి, జి.రాము, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : జీలుగుమిల్లి శివారు చంద్రమ్మకాలనీలో ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజలకు తెలియజేస్తూ ప్రచారం నిర్వహించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము చిర్రి శ్రీను, కోలా మధు, మొడియం వెంకటకృష్ణ, శాఖమూరి సాయి, పెట్లూరి రాంబాబు, రూపా సత్యనారాయణ, నెట్యం అనీల్ ఉన్నారు.

● టి.నరసాపురం : శ్రీరామవరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు, ఇతర నాయకులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పోస్టర్లు అంటించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. అడపా నాగరాజు, సిహెచ్ నవీన్, ఆళ్ళ వెంకట బాలాజీ, పాలేటి సత్యనారాయణ, కాల్నీడి నారాయణ రావు, లక్ష్మణరావు, పెద్దింటి చంటి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : బోడిగూడెం, పరింపూడి గ్రామాల్లో అధికారులు, కూటమి నాయకులు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు.

● పోలవరం : ఎల్లండీపేట, కోండ్రుకోట పునరావాస కాలనీలలో ఇది మంచి ప్రభుత్వం, పొలం పిలుస్తుంది కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ గడిచిన వంద రోజుల పాలనలో ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ఎల్లండీపేట అంగన్వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన, కోండ్రుకోట పునరావాస కాలనీలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన వ్యవసాయ చక్రం రంగవల్లులు పలువురిని ఆకర్షించాయి. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ ఏడీ బుజ్జిబాబు, తహసీల్దారు సాయిరాజు, ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్, ఏవో కె.రాంబాబు, శాస్త్రవేత్తలు డైరెక్టర్ డాక్టర్ కరుణశ్రీ, డాక్టర్ దేవీ వరప్రసాద్, పోలవరం ఏఎంసీ సెక్రటరీ యు.మోహన్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగరాజు, కార్యదర్శి తాతి విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : రామచంద్రాపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ అధ్యక్షతన జరిగింది. వంద రోజుల్లో చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పట్టణ బీజేపీ,జనసేన, అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు, షేక్ పీరు, కౌన్సిలర్లు నంబూరి రామచంద్రరాజు, వలవల తాతాజీ, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 24 : ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ నెల 17న ప్రారంభమైన 4వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ తెలిపారు. ఫార్మాకాలజీ వైద్య బృందం నిర్వహించిన ఈ వారోత్సవాల ద్వారా మందుల వినియోగం వలన కలుగు దుష్ప్రభావాలను త్వరితగతిన గుర్తించడం, అంచనా వేయడం, అవగాహన చేసుకోవడం, వీటిని నివారించడం మొదలగు విషయాలను పలు కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరిగిందన్నారు. ఈ జాతీయ ఫార్మకో విజిలెన్స్ భాగంగా ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఫార్మకాలజీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఏఎంసీని జులై 2024న ప్రారంభించడమైనదని, ఈ కేంద్రంలో మందుల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాల సమాచారాన్ని సేకరించి జాతీయ స్థాయి అధికారులకు తెలియజేశామన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ (అకాడమి) డాక్టర్ సి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్, ఆర్ఎంవో డాక్టర్ దుర్గా కుమార్, డిప్యూటీ ఆస్ట్రోనెల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లిఖార్జున, ఫార్మకాలజీ హెచ్ఓడీ డాక్టర్ పద్మావతి, అసోసియేట్ ప్రొఫిసర్స్ డాక్టర్ ఎస్ విజయకుమార్, డాక్టర్ పి.రాజ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **జంగారెడ్డిగూడెం :** మైసన్నగూడెం జల్లేరు వాగు నుంచి ట్రాక్ట రుపై ఇసుకను తరలిస్తున్న జక్కంశెట్టి ఏసురక్షణ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి ట్రాక్టరును సీజ్ చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.
- సోషల్ మీడియా వేదికగా ప్రజా ప్రతినిధులను,వ్యక్తులను అసభ్య పదజాలంతో, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన ఓ వ్యక్తిని జంగారెడ్డిగూడెం పోలీసులు మంగళవారం అరెస్టు చేసి 14 రోజులు రిమాండ్ నిమిత్తం ఏలూరు సబ్ జైలుకు పంపించినట్లు తెలిపారు.
- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పొగాకు వేలం కేంద్రంలో పిచ్చి మొక్కలను తొలగించారు. వేలం అధికారి నరేంద్ర, తదతరులు పాల్గొన్నారు.
- **బుట్టాయగూడెం :** ఏడబ్ల్యూడీ, గయ్యాళ, ప్రభుత్వ పోరంబోకు భూములను గిరిజనులకు పంచాలని, సాగులో ఉన్న గిరిజనులకు హక్కు పట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గిరిజనులు తహసీ ల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ పీవీ చలపతి రావుకు వినతిపత్రాన్ని అందజేశారు.
- జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ సాయిని విజయ భారతి మంగళ వారం ఏజెన్సీలో పర్యటించారు. అంతర్వేదిగూడెం లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను సందర్శించి పిల్లలను, ఉపాధ్యా యులను, సిబ్బందిని వివరాలడిగి తెలుసుకున్నారు.
- **దెందులూరు :** ఎన్నికల సమయంలో వీడియోలు తీసిన తమకు ఎన్నికల సంఘం ఒప్పందం ప్రకారం నగదు చెల్లించాలని నియోజకవర్గ వీడియో గ్రాఫర్లు తహసీల్దార్ బి.సుమతికి వినతిపత్రం అందజేశారు.
- **ద్వారకాతిరుమల :** విర్డ్ ఆస్పత్రిలో ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కరానంద్ కుమార్ నేతృత్వంలో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఇందులో 30 మందిని పరీక్షించగా ఆరుగురికి శస్త్రచికిత్సలు చేశారు.
- **ఏలూరు రూరల్ :** దీపావళి బాణాసంచా సామగ్రి అమ్ముకునేందుకు తాత్కాలిక లైసెన్స్ కోసం ఈ నెల 25 నుంచి అక్టోబర్ 15వ తేదీలోపు ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలీ ఒక ప్రకటనలో తెలిపారు.
- స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ఈ నెల బుధ, గురువారాల్లో శనివారపుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ పద్మలత తెలిపారు.
- పెదపాడు మండలం వడ్డిగూడెంలో 12.18 ఎకరాల భూమి ఆక్రమించుకున్నానని దెందులూరు చింతమనేని చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని కొల్లేరు, వైసీపీ నాయకుడు మోరు రామరాజు అన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** స్థానిక కుమ్మరిరేవు ప్రాంతంలో 20 సంవత్సరాలుగా ఆక్రమించుకుని అనుభవిస్తున్న పేద ప్రజలకు వారి ఇళ్ళకు శాశ్వత నివాస గృహ పట్టాలు అందచేయాలని సీపీఎం శాఖ కార్యదర్శి జి.యేసుబాబు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.
- **చింతలపూడి :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు ఉన్నారు.
- **ఉంగుటూరు :** ఉంగుటూరు, కైకరం రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం విషయమై మంగళవారం ఏలూరు ఆర్డీవో ఖాజావలి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. సికింద్రాబాదు రైల్వే డివిజన్ అధికారులు శశి భూషణ్, సాయి కిరణ్, శ్రీకాంత్ ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేలా నిర్ణయం తీసుకుంటామన్నారు.
- **ఏలూరు క్రైం :** కైకలూరు రూరల్ సీఐగా వి.రవికుమార్‌ను నియమిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.
- **కుక్కునూరు :** గుండుగూడెంలో జరిగిన శాఖ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ గిరిజనులు నేటికి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారని ప్రభుత్వాలు వారికి మౌలిక సదుపాయాలు అందించాలన్నారు.
- **జీలుగుమిల్లి :** బొత్తప్పగూడెం చెందిన కాక చక్రధర్ భార్య మాధవి కొద్ది రోజల క్రితం మగ బిడ్డను ప్రసవించింది. చిన్న పేగులో సమస్య వచ్చి విజయవాడ రెయిన్‌బో ఆస్పత్రిలో చేర్చారు. వైద్యం నిమిత్తం ఇప్పటికే రూ.3 లక్షలు ఖర్చు చేశారు. వైద్యం కొనసాగిస్తున్నారు. ఆపరేషన్‌కు ఇంకా రూ.3 లక్షలు కావాల్సి ఉందని ఆ దంపతులు కోరారు. కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి జీలుగుమిల్లి పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ కూరం ప్రసాద్ రూ.10 వేలు సాయం అందించారు. 94945 97030కు ఫోన్ పే, చేయాలని పలు ప్రసార మాధ్యమాల ద్వారా దాతల్ని కోరుతున్నారు.



అమరావతిలో మంత్రి కొల్లు రవీంద్ర, మైనింగ్ ఎండీ, స్పెషల్ సెక్రటరీలకు వినతిపత్రం అందిస్తున్న టిప్పర్ లారీల యూనియన్ నాయకులు

నేటి నుంచి ఇసుక సరఫరా.. తొలగిన అవాంతరాలు

పాలకొల్లు, సెప్టెంబరు 24: రెండురోజులుగా ఆన్‌లైన్ ఇసుక బుకింగ్‌లు జరుగుతున్నా స్టాక్ పాయింట్లలో ఇసుక ఎగుమతులు జరగడం లేదు. టిప్పర్ లారీ యూనియన్ నాయకులు నిబంధనలు అమలు చేస్తేనే ఇసుక సరఫరా చేస్తామని ఆయా జిల్లాల కలెక్టర్లు, మైనింగ్ అధికారులకు తెలిపారు. టిప్పర్ లారీ యూనియన్ నాయకులు మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని సంబంధిత అధికారులను కలిసి తమ ఇబ్బందులను తెలియజేశారు. మంత్రి కొల్లు రవీంద్ర, మైనింగ్ ఎండీ, స్పెషల్ సెక్రటరీ ముఖేష్ మీనా తదితరులను టిప్పర్ లారీ రాష్ట్ర యూనియన్ నాయకులు కలిశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక ర్యాంపులు, స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకతోలే లారీలు నిర్ణీత డిపాజిట్ చెల్లించాలని, అగ్రిమెంట్ ఇవ్వాలని, స్లాట్ సమయానికి ఇసుక ఎగుమతికి లారీలు వెళ్లకపోతే పెనాల్టీ చెల్లించాలని గతంలో నిబంధనలు విధించారు. అయితే ఇప్పుడు వాటన్నింటినీ తొలగించడానికి మంగళవారం లారీ యూనియన్ నాయకులకు మైనింగ్ ఎండీ హామీ ఇచ్చారు. దీంతో బుధవారం నుంచి ఇసుక ఎగుమతులు జరగనున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టిప్పర్ లారీల యూనియన్ అధ్యక్షుడు రావూరి రాజా, నాగరాజు, వెంకటేశ్వరరావు తదితరులు జిల్లా నుంచి అమరావతికి వెళ్లారు.



స్కూల్ గేమ్స్‌కు రగ్బీ జిల్లా జట్ల ఎంపిక

పెదవేగి, సెప్టెంబరు 24 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 19 విభాగం బాలబాలికల రగ్బీ జిల్లా జట్ల ఎంపిక పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో మంగళవారం జరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో విద్యాలయాల నుంచి వచ్చిన విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో బాలురు, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, పీఈటీ గురుమూర్తి, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.



ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన మూర్తికి స్వామివారి చిత్రపటాన్ని ఇస్తున్న డిప్యూటీ ఈవో బాబూరావు

ద్వారకాతిరుమల ఆలయ ఈవోగా మూర్తి బాధ్యతలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 24: ద్వారకాతిరుమల దేవస్థానం ఈవోగా ఎన్‌వీఎస్ఎన్ మూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. ఇప్పటివరకూ పనిచేసిన ఈవో వేండ్ర త్రినాథరావు నుంచి చార్జ్ తీసుకున్నారు. తిరుమల తిరుపతి ఆర్జేసీగా పనిచేస్తున్న ఆయనను ద్వారకా తిరుమలకు బదిలీ చేశారు. ఇప్పటివరకూ ఈవోగా ఇక్కడ పనిచేసిన వేండ్ర త్రినాథరావును సింహాచలంలోని వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంకు బదిలీ చేశారు. చార్జ్ తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.



ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికల్లో పరుగు పందెం

నన్నయలో ఎన్‌సీసీ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24: త్రివిధ దళాలు దేశ సరిహద్దులో రక్షణ కవచంగా ఉంటే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటివి దేశ అంతర్గత రక్షణకు, భవిష్యత్‌కు దిక్సూచిలుగా నిలుస్తాయని ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వెస్ట్‌జోన్ ఎన్‌సీసీ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరం ఎంపికలు మంగళవారం నిర్వహించారు. వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో జరిగే ఎంపికల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి వచ్చే ఏడాది జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవంలో నన్నయ విశ్వవిద్యాలయ ఔన్నత్యానికి చిహ్నాలుగా నిలవాలన్నారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర యువజన అధికారి సైదా మాట్లాడుతూ ఈ శిబిరంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రీఆర్డీ శిబిరానికి ఎంపిక చేస్తామన్నారు. ప్రతిభావంతులైన వారిని ఢిల్లీ శిబిరానికి ఎంపిక చేస్తామని తెలిపారు. మంగళవారం జరిగిన ఎంపికలకు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో నుంచి 155 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీసీ మొక్కను నాటారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం వసూలు చేసిన రూ.30 వేల చెక్కును ఆయనకు అందజేశారు.రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్, ఎన్ఎస్ఎస్ పీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాకీకి వెళితే కిడ్నాప్ చేశారని ఫిర్యాదు

ఉంగుటూరు, సెప్టెంబరు 24 : బకాయి అడిగేందుకు వెళ్లిన ఇద్దరిని కిడ్నాప్ చేశారంటూ చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడేనికి చెందిన మందల మాణిక్యాలరావు, మరో వ్యక్తి ఉంగుటూరు మండలం నీలాద్రిపురం వెళ్లగా ఇంటికి రాలేదని తమ వారిని సలీంరాజు అనే వ్యక్తి కిడ్నాపు చేశాడని బంధువులు ఫిర్యాదు చేశారు. ఉభయ వర్గాలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకు వచ్చి విచారణ జరిపామని తగిన చర్యలు తీసుకుంటామని చేబ్రోలు ఎస్ఐ సూర్య భగవాన్ తెలిపారు. విచారణ అనంతరం ఎఫ్ఐఆర్ సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తామన్నారు.

స్ట్రీట్ ఫుడ్.. జరభద్రం !



ఫాస్ట్‌ఫుడ్ ఫ్యాషన్‌గా మారింది. ఉరుకుల పరుగుల జీవితంతో తినుబండరాలు తయారు చేసుకోలేక ప్రజలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై మక్కువ చూపుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, బజ్జీల బండ్లు, టిఫిన్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఆడ-మగ, పేద-గొప్ప, చిన్నా-పెద్దా తారతమ్యం లేకుండా వాటిని తిని పొట్టలు పెంచేస్తున్నారు. కొందరు యజమానులు అపరిశ్రుభ వాతావరణంలో స్ట్రీట్‌ఫుడ్స్, వాడిన వంట నూనెనే మరలా మరలా వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యాలను డేంజర్‌లో పడేస్తున్నారు.



వీధి వీధినా ఫుడ్ సెంటర్లు
వాడిన నూనెతోనే మళ్లీ వంటలు
కల్తీ పదార్థాలతో రోగాలు
కానరాని శుభ్రత .. కొరవడిన తనిఖీలు

పాలకొల్లు/ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 24 : పరిమితి ఆహారం మాట అలా ఉంచితే పనికిమాలిన ఆహారాన్ని పరమాన్నంలా భుజించేస్తూ చాలామంది రోగాలు పాలవుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యుహెచ్‌వో చెప్పిన ప్రకారం 60 శాతం వ్యాధులు కలుషిత తాగునీరు వల్ల 40 శాతం వ్యాధులు కలుషిత ఆహార పదార్థాల వల్ల వస్తున్నాయని తేలింది. ఇప్పుడు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గల్లిగల్లీకి టిఫెన్ సెంటర్లు, బజ్జి బండ్లు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లు కుప్పతెప్పలుగా వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 10 లక్షలు కుటుంబాలు ఉండగా కుటుంబానికి రోజుకి వంద గ్రాములు చొప్పున వంట నూనె వినియోగిస్తే సరాసరి వంద టన్నులు ఖర్చు అవుతుంది. రోజుకి మరో 50 టన్నులు మిఠాయి అంగళ్లు రెస్టారెంట్లు, ఇంకా వివిధ వాణిజ్య వినియోగాలకు రోజుకు సుమారు 50 టన్నులు నూనె వాడేస్తున్నారు. ఇందులో వినయోగించిన నూనెనే మళ్లీ మళ్లీ వినియోగిస్తున్నారు. పాస్ట్ ఫుడ్ సెంటర్లు, బజ్జీ బండ్లు, చిన్నతరహా టిఫెన్ సెంటర్లలో 20 శాతం పైబడి కాక నూనె వినియోగం అవుతున్నట్లు తేలింది. కాక నూనెతో అనేక వ్యాధులు బారిన పడుతున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం వంట నూనెల దిగుమతులుపై దిగుమతి సుంకం పెంచడంతో ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. దీంతో వాడిన నూనెనే వినియోగించడం మరింత పెరిగింది.

కాక నూనెతో వ్యాధులు

ఒకసారి వేడి చేసిన నూనెను మరలా మరలా వినియోగించడం ద్వారా గుండె, లివర్ వ్యాధులు హైపర్ టెన్షన్, అల్జీమర్ వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చెడు కొలెస్ట్రాల్ పెరగడమే కాకుండా కడుపులో మంట, గ్యాస్, కాలేయం సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా నిషేధిత రంగులు కలిపి ప్రజలకు నోరూరించే విధంగా తయారు చేస్తున్నారు. వీటినే లొట్టలేసుకుంటూ తింటూ ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. తనిఖీలు లేకపోవడంతో వీధి వీధికి స్టాల్స్ వెలిశాయి. ఫ్రైడ్‌రైస్, చికెన్ ఫ్రైడ్‌రైస్, ఎగ్ న్యూడిల్స్, చికెన్ నూడిల్స్ తయారీలో కల్తీ వంట నూనెలు వాడుతున్నారు. కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. పానీపూరి బళ్ల వద్ద శుభ్రతే ఉండదు.

50 శాతం మంది అల్పాహారమే

ఇప్పుడు జిల్లాలో డైట్ పేరుతో రాత్రి పూట 50 శాతం మంది అల్పాహారం పేరుతో సాయంత్రం సమయాలలో రోడ్లపై పడి స్ట్రీట్ ఫుడ్ తినేస్తున్నారు. దీంతో రోగాలు దానంతటవే చుట్టుముడుతున్నాయి. రాత్రి సమయాల్లో ఇప్పుడు 30 నుంచి 40 శాతం ఇళ్లల్లో స్టవ్ వెలిగించే పరిస్థితి కనిపించడం లేదు. బజారులో పాస్ట్ ఫుడ్ తిని మళ్లీ ఇంట్లో భార్య పిల్లలకు తీసుకెళ్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలా కొనితెచ్చుకుంటున్న రోగాలు వైద్యులకు వరంగా మారుతున్నాయి

ఆహార తనిఖీ అధికారులు ఏరీ ?

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దశాబ్ద కాలానికి ముందు పురపాలక సంఘాల వారీగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉండేవారు. తమ పరిధిలో ఫలహారశాలల్లోనూ, రెస్టారెంట్లలోనూ తనిఖీలు చేసి పరిశుభ్రతకు చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు జిల్లాలో అధికారి సైతం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. కొన్ని వందల సంఖ్యలో షాపులు వెలుస్తున్నాయి. కానీ వీటిలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నుంచి పర్మిషన్ తీసుకున్నవాళ్ళు చాలా తక్కువ. ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కల్తీ ఆహార విక్రయాలపై చర్యలు తీసుకుంటాం

కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసి అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. తరచుగా తనిఖీలు నిర్వహించి కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసే వారి నుంచి శాంపిల్స్ తీసుకుంటున్నాం. వాటిని హైదరాబాదులోని ఫుడ్ శాంపిల్స్ టెస్ట్ ల్యాబ్‌కు పంపిస్తున్నాం. 14 రోజుల్లో రిపోర్టు వస్తుంది. ఆ రిపోర్టులో తేడాలున్న వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. గతేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 431 శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపించాం. వాటిలో 27 శాంపిల్స్‌లో తేడా ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయి. వారి నుంచి రూ.13,56,000 అపరాధ రుసుం వసూలు చేశాం.

- రామరాజు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్



పరిసరాల పరిశుభ్రతే చూస్తాం

ఆహార పదార్థాల తనిఖీ చేసే అధికారం మాకు లేదు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయో లేదో చూస్తాం. ఆహారం పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా చూసుకోవాలని యాజమానులను ఆదేశిస్తాం. శాంపిల్స్ సేకరణ, కేసులు నమోదు చేయడం, తనిఖీలు చేయడం మా పరిధిలో లేదు.

-డాక్టర్ మాలతి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, ఏలూరు

వివిధ సర్వేల ప్రకారం 60 శాతం కుటుంబాలలో కాక నూనెను విని యోగిస్తున్నట్లు తేలింది. ముఖ్యంగా పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాల్లో వాడిన నూనె వినియోగం అధికంగా ఉంది. సంపన్న వర్గాలలో ఒకసారి వాడిన నూనెనె ఇంట్లో పనిచేసేవాళ్లకు ఇచ్చివేయడం లేక పారవేయడం చేస్తుండగా అధిక శాతం కుటుంబాలలో వాడిన నూనే మళ్లీ వినియోగిస్తున్నారు.

కేంద్రప్రభుత్వం ఆమోదం పొందిన ఎస్ఎస్ఆర్ ఇండస్ట్రీస్ ఒకసారి వాడిన నూనెలను కొనుగోలు చేస్తుంది. ఇప్పటికే విశాఖపట్టణంలోని హోటళ్లు, గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంటుల్లో వాడిన వంట నూనె సేకరణకు డ్రమ్ములు ఏర్పాటు చేసి కనీస ధరకు వంట నూనెలను కొనుగోలు చేస్తున్నారు. ఈ విధానం రాష్ట్రం అంతా అమలైతే కొంత మేరకు కాక నూనె కష్టాల తగ్గుతాయి.

పాలకొల్లు పట్టణంతో సహా పలు పట్టణాలలో దుర్గంధం వెదజల్లే మురుగు డ్రైన్ల పక్కనే టిఫెన్ సెంటర్లను నిర్వహిస్తున్నారు. అటువంటి ప్రాంతాలలో హోటళ్లు నిర్వహణ ఒక ఎత్తైతే అక్కడ నిలబడి ఆబగా తినేవాళ్ల పరిస్థితి చూస్తే జాలి కలగక మానదు.



హోటల్లో ఆకస్మిక తనిఖీచేస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

హోటల్స్, బేకరీలలో నిల్వ పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు : జేసీ

భీమవరం టౌన్, సెప్టెంబరు 24 : జిల్లాలో హోటల్స్, బేకరీలు, స్వీట్ షాపుల్లో నిల్వపదార్థాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని, ఇక నుంచి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. భీమవరం పట్టణంలోని ఉండి రోడ్డులో ఉన్న స్పైస్ మ్యాజిక్ రెస్టారెంట్‌ను మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రెస్టారెంట్‌లో ఉన్న పదార్థాల ప్యాకెట్లను స్వయంగా పరిశీలించారు. ఇటీవల కొన్ని హోటల్స్‌లో నిల్వ ఆహార పదార్థాలు అమ్మడం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. ఈరోజు తనిఖీలో భాగంగా స్పైస్ మ్యాజిక్ రెస్టారెంట్‌లో మటన్ కర్రీ, చిల్లీ పౌడర్ శ్యాంపిల్స్ తీశామన్నారు. వీటిని ల్యాబ్‌కు పంపుతున్నామన్నారు. పరీక్షలలో కల్తీ అని తేలితే రిపోర్టులు ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పదార్థాలపై ఫుడ్ కలర్స్ పూసి తాజాగా ఉన్నట్లు చూపిస్తున్నారని అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టేస్టింగ్ సాల్టు వినియోగం కూడా జరుగుతుందని దీనివల్ల అనారోగ్యాలు వస్తాయన్నారు. స్వీట్ షాపులు, బేకరీలలో నిల్వ ఉంచినవి అమ్ముతున్నారని తన దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి ఏ.ఎస్.ఆర్ రెడ్డి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎం.శ్రీనివాస్ ఉన్నారు.

విద్యుత్ శాఖలో ఈఈలు, డీఈఈల బదిలీలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 24: విద్యుత్ శాఖలో భారీ ఎత్తున బదిలీలు నిర్వహించారు. ఈఈలు, డీఈఈలు క్యాడర్‌లో ఏలూరు సర్కిల్ పరిధిలో బదిలీలకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. నిడదవోలు ఈఈ వీరభద్రరావును జగ్గంపేటకు, ఏలూరు డీఈ ఝాన్సీని పశ్చిమ గోదావరి ఈఈ టెక్నికల్ అండ్ కన్‌స్ట్రక్షన్‌కు, ఏలూరు ఈఈ నటరాజన్‌ను రాజమహేంద్రవరం ఈఈ/డీపీఈగా, తాడేపల్లిగూడెం ఈఈ వెంకటేశ్వరరావును పశ్చిమగోదావరి ఈఈ (ఆపరేషన్స్), భీమవరం ఆపరేషన్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్‌ను ఏలూరు ఈఈ (టెక్నికల్), విజయవాడలో ఎస్ఎల్‌డిసి ఈఈ నరసింహమూర్తిని తాడేపల్లిగూడెం ఈఈ (ఆపరేషన్స్), ఏలూరు ఈఈ (ట్రాన్స్‌పార్మర్స్) నారాయణ అప్పారావును నిడదవోలు ఈఈ (ఆపరేషన్), తాడేపల్లిగూడెం ఈఈ (ఎంఅండ్‌పీ) రఘును పశ్చిమ గోదావరి ఈఈ (ఎంఆర్‌టీ)గా బదిలీ చేశారు. కామవరపుకోట డిప్యూటీ ఈఈ సీఅండ్‌వోకు పదోన్నతి కల్పించి ఏలూరు ఈఈగా (ఎంఆర్‌టీ) నియమించారు.

డీఈఈ బదిలీలు

ఏలూరు హెచ్‌టీఎం -1 డీఈఈ మురళీకృష్ణను కామవరపుకోట ఆపరేషన్ డీఈఈగా, తణుకు ఆపరేషన్ డీఈఈ రామకృష్ణను ఏలూరు హెచ్‌టీసిటిఎం-2 డీఈఈగా, పెద్దాపురం కమర్షియల్ అండ్ టెక్నికల్ డీఈఈ రాంబాబును భీమవరం ఆపరేషన్ డీఈఈగా నియమించారు. బొమ్మూరు హెచ్‌టీఎం-1 డీఈఈ కృష్ణనాయక్‌ను కొవ్వూరు ఆపరేషన్ డీఈఈగా కొవ్వూరు ఆపరేషన్ డీఈఈ అచ్యుతాచారిని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ హెచ్‌టీసిటిఎం-2 డీఈఈగా, ఏలూరు సీటీఎం డీఈఈ శ్రీనివాసరావును ముమ్మిడివరం ఆపరేషన్ డీఈఈగా, వట్లూరు జిల్లా స్టోర్స్ డీఈఈ రమాదేవిని ఏలూరు కమర్షియల్ అండ్ టెక్నికల్ డీఈఈగా, ఏలూరు డీఈఈ (కమర్షియల్) సుజాతను వట్లూరు జిల్లా స్టోర్స్ డీఈఈగా, ఏలూరు టీఆర్ఈ డీఈఈ రఘుబాబును ఏలూరు క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా, ఏలూరు డీఈఈ (ఆపరేషన్స్) వాసును ఏలూరు హెచ్‌టీసిటిఎం -1 డీఈఈగా, ఆకివీడు ఆపరేషన్ డిఈఈ ఎల్‌వీ శ్రీనివాసరావును ఏలూరు రూరల్ ఆపరేషన్ డీఈఈగా, ఏలూరు క్వాలిటీ కంట్రోలర్ డీఈఈ మల్లేశ్వరరావును ఏలూరు డీపీఈ డీఈఈగా, నిడదవోలు కన్‌స్ట్రక్షన్ డీఈఈ చైతన్యవర్మను పశ్చిమగోదావరి కన్‌స్ట్రక్షన్ డీఈఈగా , తాడేపల్లిగూడెం ప్రొటెక్షన్ -2 డీఈఈ శ్రీనివాసరావును పశ్చిమగోదావరి టీఆర్ఈ అండ్ ప్రొటెక్షన్ డీఈఈగా, ఏలూరు డీపీఈ-1 డీఈఈ రత్నప్రకాష్‌ను పశ్చిమగోదావరి హెచ్‌టీసిటిఎం-3 డీఈఈగా, తాడేపల్లిగూడెం సీటీఎం డీఈఈ నెలబాలుడును పశ్చిమ గోదావరి హెచ్‌టీసిటిఎం-2ను తాడేపల్లిగూడెం సీటీఎం డీఈఈగా, తాడేపల్లిగూడెం హెచ్‌టిఎం-2 డీఈఈ సూర్యకళను పశ్చిమగోదావరి ఎల్‌టీఎం అండ్ ఎస్‌పిఎం డీఈఈగా, పెదవేగి ఆపరేషన్ డీఈఈ శ్రీనివాసును తణుకు ఆపరేషన్ డీఈఈగా, జంగారెడ్డిగూడెం కన్‌స్ట్రక్షన్ డీఈఈ శ్రీనివాసరావును ఆకివీడు ఆపరేషన్ డీఈఈగా, ముమ్మిడివరం ఆపరేషన్ డీఈఈ వీరభద్రరావును భీమవరం ఆపరేషన్ డీఈఈగా, భీమవరం ఆపరేషన్ డీఈఈ రాజగోపాలచౌదరిను తాడేపల్లిగూడెం ఆపరేషన్ డీఈఈగా, తాడేపల్లిగూడెం ఆపరేషన్ డీఈఈ సతీష్‌ను పశ్చిమగోదావరి కమర్షియల్ అండ్ టెక్నికల్ డీఈఈగా, ఏలూరు ప్రొటెక్షన్ డీఈఈ మురళీధర్‌ను ఏలూరు టీఆర్ఈ అండ్ ప్రొటెక్షన్ డీఈఈగా, ఏలూరు ఎస్‌పిఎం డీఈఈ రమేష్‌ను ఏలూరు ఎల్‌టీఎంఅండ్ ఎస్‌పిఎం డీఈఈగా, భీమవరం హెచ్‌టీఎం డీఈఈ వేణుగోపాల్‌ను పశ్చిమగోదావరి హెచ్‌టీసీటిఎం డీఈఈగా బదిలీ చేశారు.

ట్రాన్స్‌కో పశ్చిమ గోదావరి ఎస్ఈగా రఘునాథబాబు

భీమవరంటౌన్, సెప్టెంబరు 24 : పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి టాన్స్‌కో సూపరింటెండెంట్‌ను నియమించారు. ట్రాన్స్‌కోలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న రఘునాథబాబును ఎస్ఈగా నియమించారు. జిల్లా ఏర్పడిన రెండేళ్ల తరువాత ట్రాన్స్‌కో ఎస్ఈ పోస్టును భర్తీ చేశారు. ఇప్పటి వరకు ఏలూరులో ట్రాన్స్‌కో ఎస్ఈ పరిధిలోనే ఉండేది. జిల్లాకు సంబంధించిన వాటిపై ఈఈ పర్యవేక్షించేవారు. ఇప్పుడు ఎస్ఈ పోస్టు భర్తీ కావడంతో జిల్లాకు పూర్తిస్థాయి అధికారి వచ్చినట్లయింది.



ఐదు రోజుల బాలుడికి చికున్ గున్యా

ఆకివీడు, సెప్టెంబరు 24 : నవజాత శిశువుకు చికెన్ గున్యా వ్యాధి సోకడంతో నివారణకు ప్రైవేటు వైద్యులు చికిత్స అందించి తల్లీబిడ్డను ఇంటికి క్షేమంగా పంపించారు. కుప్పనపూడికి చెందిన నాగ సరస్వతి ఈనెల 5న బిడ్డకు జన్మనిచ్చింది. ముక్కు దగ్గర బాగా నల్లగా ఉండడంతో పాటు చికెన్ గున్యా లక్షణాలు కనబడ్డాయి. దీంతో తల్లిదండ్రులు భీతిల్లిపోయారు. స్థానిక రామరాజు హాస్పటల్‌కు తీసుకు వెళ్లగా చిన్న పిల్లల వైద్యుడు కలిదిండి మహేష్‌వర్మ వైద్యం అందించారు. రక్తనమూనాలు ఢిల్లీ ల్యాబ్‌కు పంపించారు. రిపోర్టు పాజిటివ్ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. వైద్యుడు రామరాజు మాట్లాడుతూ తల్లికి తొమ్మిదో నెలలో జ్వరం రావడంతో ఎంతకీ తగ్గకపోవడంతో చికున్‌గున్యాగా గుర్తించామన్నారు. తల్లి నుంచి బిడ్డకు ఈ వ్యాధి సోకిందన్నారు. యాభై ఎనిమిది వేల మంది చిన్నారుల్లో ఒక్కరికి అరుదుగా ఈ వ్యాధి సోకుతుందన్నారు.



వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ కిషోర్

బంగారం చోరీ దొంగలు అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 24 : ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరించిన ఇద్దరు దొంగలను 72 గంటల్లో అరెస్టు చేసి చోరీకి గురైన సొత్తు మొత్తాన్ని రికవరీ చేసినట్టు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఈనెల 19వ తేదీ ఉదయం నూజివీడులోని ఎంప్లాయిస్ కాలనీలో నివాసం ఉంటున్న వల్లభనేని కాశీలక్ష్మి అన్నపూర్ణ తమ కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్ళారు. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని ఇరవై ఒక కాసుల రెండు గ్రాముల బంగారు ఆభరణాలు, ఎనిమిది కేజీల వెండి వస్తువులు, 45 వేల రూపాయల నగదును అపహరించుకుపోయారు. మొత్తం 7 లక్షల పది వేల రూపాయల విలువైన సొత్తు చోరీ చేశారు ఈ సంఘటనపై నూజివీడు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు నూజివీడు సీఐ సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో టౌన్ ఏఎస్ఐ కాశి బేగ్, కానిస్టేబుళ్ళు రవీంద్రబాబు, శ్రీనివాసరావు, క్లూస్ టీమ్ ఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్‌కానిస్టేబుళ్ళు బాలరమేష్, శంకరరావు, కానిస్టేబుల్ ధర్మరాజులు గాలింపు చేపట్టారు. ఈ నేరానికి పాల్పడిన దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ మసీదుపాడుకు చెందిన గురువిందుల వెంకటరమణ (36), బొంతు నరేంద్ర (26)లను అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తు మొత్తం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

కామవరపుకోట, సెప్టెంబరు 24 : కామవరపుకోట మండలం తడికలపూడిలో ఒక రైతు తన పొలంలో కరెంటు మెయిన్ వేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నిజవరపు సత్యనారాయణ (45) అనే వ్యక్తి తన పొలంలో నీటిని వదిలేందుకు స్విచ్ వేయగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్రైమ్ కార్నర్

గోదావరిలో దూకి ఒకరి గల్లంతు
బైక్ ఆధారంగా భీమవరానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు



కొవ్వూరు, సెప్టెంబరు 24 : కొవ్వూరు రోడ్డుకం రైలు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఒక వ్యక్తి గల్లంతయ్యాడు.మంగళవారం సాయంత్రం కొవ్వూరు, రాజమహేంద్రవరంల మధ్య రోడ్డు కం రైలు బ్రిడ్జి 127వ స్తంభం వద్ద బైక్‌ను పార్క్ చేసి ఒక వ్యక్తి గోదావరిలో దూకాడు. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ ప్రకాష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బైక్‌ను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బైక్‌పై భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్టిక్కర్ అంటించి ఉండడం, నంబరు ప్లేట్ ఆధారంగా భీమవరం వ్యక్తిగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గల్లంతైన వ్యక్తి కోసం గోదావరిలో గాలింపు చేపట్టారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం

లింగపాలెం, సెప్టెంబరు 24: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ధర్మాజీగూడెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లింగపాలెం మండలంలోని తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో ధర్మాజీగూడెం అడ్డరోడ్డు వద్ద ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్, ఓనర్ చిలకబత్తుల సురేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే వారి పై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఏలూరుపాడులో 144 సెక్షన్

కాళ్ళ సెప్టెంబరు 24 : కాళ్ళ మండలం ఏలూరుపాడులో శాంతిభద్రలకు విఘాతం కలగకుండా నేటి నుంచి 14 రోజుల పాటు గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కాళ్ళ ఎస్ఐ నాళం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జునలు తెలిపారు. జిల్లా ఎస్పీ, భీమవరం డీఎస్పీ ఆదేశాల మేరకు ఆకివీడు సీఐ ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు చెప్పారు. గ్రామంలో ఎక్కడా గుంపుగా గాని ఐదుగురు కంటే ఎక్కువ వ్యక్తులు గాని ఉండరాదని స్పష్టం చేశారు. బయట నుంచి వచ్చి గ్రామంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దొరకని మెడికో ఆచూకీ.. మారేడుమిల్లిలో కొనసాగుతున్న గాలింపు



మారేడుమిల్లి, సెప్టెంబరు 24: అల్లూరి జిల్లా మారేడుమిల్లి జల తరంగిణిలో ఆదివారం కొట్టుకుపోయిన మెడికల్ విద్యార్థి చింతకుంట్ల హరదీప్ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. ఆదివారం జరిగిన ఈ దుర్ఘటన అనంతరం సహాయక చర్యలు చేపట్టిన అధికారులు సోమవారం ఇద్దరు వైద్య విద్యార్థినుల మృతదేహాలను కనుగొన్న సంగతి తెలిసిందే. మరొక విద్యార్థి ఆచూకీ కోసం మంగళవారం కూడా ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో కొండవాగులు, కల్వర్టులు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థి జాడ కన్పించక పోవడంతో రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి డ్రోన్ కెమెరాను వినియోగిస్తూ జల్లెడ పడుతున్నారు. జల తరంగిణి నుంచి నీటి ప్రవాహం పలు కల్వర్టులు, దట్టమైన పొదలు మీదుగా ప్రవహిస్తూ పాములేరు వాగులోకి అక్కడి నుంచి గోదావరి నదిలోకి నీటి ప్రవాహం చేరుకొనే అవకాశం ఉండడంతో ఆ దిశగా గాలింపు చేపట్టారు. ఎన్‌డీఆర్ఎఫ్‌తో పాటు ప్రత్యేక బృందం డ్రోన్ కెమెరా సాయంతో పాములేరు వాగులో కొన్ని కిలోమీటర్ల మేర గాలింపు చేపట్టింది మంగళవారం బాగా చీకటి పడడంతో పాములేరు వాగు ప్రమాదకరంగా ఉండడంతో తిరిగి బుధవారం గాలింపు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. సబ్ కలెక్టరు కల్పశ్రీ, తహసీల్దారు సుబ్బారావు, సీఐ మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

నూజివీడు, సెప్టెంబరు 24: చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఉయ్యూరుకు చెందిన పల్లగాని విజయ్‌కుమార్‌కు ఆరు నెలల జైలు, రూ. 3 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు ఇచ్చారు. నూజివీడుకు చెందిన దండమూడి అజయ్‌కుమార్, పల్లగాని విజయ్‌కుమార్‌కు 2018లో రూ.2 లక్షల 50 వేలు అప్పుగా ఇచ్చాడు. తరువాత బాకీ చెల్లించమని కోరగా విజయ్‌కుమార్ రూ.2 లక్షల 75 వేలు చెక్కు అజయ్ కుమార్‌కు ఇచ్చాడు. ఆ చెక్కు చెల్లలేదు. దీంతో అజయ్ కుమార్ కోర్టులో కేసు వేయగా, విచారణ అనంతరం న్యాయమూర్తి పలగాని విజయ్‌కుమార్‌కు జైలు, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.


ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన మూర్తికి స్వామివారి చిత్రపటాన్ని ఇస్తున్న డిప్యూటీ ఈవో బాబూరావు

ద్వారకాతిరుమల ఆలయ ఈవోగా మూర్తి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 24: ద్వారకాతిరుమల దేవస్థానం ఈవోగా ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. ఇప్పటివరకూ పనిచేసిన ఈవో వేండ్ర త్రినాథరావు నుంచి చార్జ్ తీసుకున్నారు. తిరుమల తిరుపతి ఆర్జేసీగా పనిచేస్తున్న ఆయనను ద్వారకా తిరుమలకు బదిలీ చేశారు. ఇప్పటివరకూ ఈవోగా ఇక్కడ పనిచేసిన వేండ్ర త్రినాథరావును సింహాచలంలోని వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంకు బదిలీ చేశారు. చార్జ్ తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

చాట్రాయి మండలంలో రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు

చాట్రాయి, సెప్టెంబరు 24: మంత్రి పార్థసారథి చొరవతో మండలంలో 18 గ్రామ పంచాయతీల పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ. 3.96 కోట్లు ఉపాధి నిధులు మంజూరు చేస్తూ ఇటీవల కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరుగొలనుపేట, బూరుగుగూడెం గ్రామాలకు రూ 10 లక్షలు చొప్పున, కృష్ణారావు పాలెం రూ 13 లక్షలు, కోటపాడు రూ 18.30 లక్షలు, చీపురుగూడెం, చిన్నం పేట, చిత్తపూరు, కొత్తగూడెం, నరశింహారావుపాలెం, పర్వతాపురం, పోతనపల్లి, సోమవరం, తుమ్మగూడెం గ్రామాలకు రూ 20 లక్షలు చొప్పున మంజూరు అయ్యాయి, చాట్రాయి, మర్లపాలెం గ్రామాలకు రూ 25 లక్షల చొప్పున, పోలవరం,జనార్ధనవరం రూ 30 లక్షలు చొప్పున, చనుబండ రూ 55 లక్షలు, మెత్తం రూ 3.96 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. మొత్తం 37 పనులకు గాను సీసీ రోడ్లు 9380 మీటర్లు పొడవు, సీసీ డ్రెయిన్లు 1800 మీటర్లు పొడవు నిర్మించనున్నారు.

వినోద్‌కు పలువురి అభినందన

ముదినేపల్లి, సెప్టెంబరు 24 : ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ కైకలూరు నియోజకవర్గ కో-కన్వీనర్ కొడాలి వినోద్ నియామకం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ముదినేపల్లిలోని వినోద్ నివాసం వద్ద టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, దాకరం సర్పంచ్ జాస్తి రాజా, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, టీడీపీ నాయకులు పోలవరపు ప్రసాద్‌బాబు తదితరులు ఆయన్ని కలసి సత్కరించారు.



క్రైం కార్నర్..


వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ కిషోర్

దొంగలు అరెస్టు.. సొత్తు స్వాధీనం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 24 : ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరించిన ఇద్దరు దొంగలను 72 గంటల్లో అరెస్టు చేసి చోరీకి గురైన సొత్తు మొత్తాన్ని రికవరీ చేసినట్టు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఈనెల 19వ తేదీ ఉదయం నూజివీడులోని ఎంప్లాయిస్ కాలనీలో నివాసం ఉంటున్న వల్లభనేని కాశీలక్ష్మి అన్నపూర్ణ తమ కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లారు. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని ఇరవై ఒక కాసుల రెండు గ్రాముల బంగారు ఆభరణాలు, ఎనిమిది కేజీల వెండి వస్తువులు, 45 వేల రూపాయల నగదును అపహరించుకుపోయారు. మొత్తం 7 లక్షల పది వేల రూపాయల విలువైన సొత్తు చోరీ చేశారు ఈ సంఘటనపై నూజివీడు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు నూజివీడు సీఐ సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో టౌన్ ఏఎస్ఐ కాశి బేగ్, కానిస్టేబుళ్ళు రవీంద్రబాబు, శ్రీనివాసరావు, క్లూస్ టీమ్ ఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్‌కానిస్టేబుళ్ళు బాలరమేష్, శంకరరావు, కానిస్టేబుల్ ధర్మరాజులు గాలింపు చేపట్టారు. ఈ నేరానికి పాల్పడిన దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ మసీదుపాడుకు చెందిన గురువిందుల వెంకటరమణ (36), బొంతు నరేంద్ర (26)లను అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తు మొత్తం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కేసులో చాక చక్యంగా వ్యవహరించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చెల్లని చెక్కు ఇచ్చినందుకు జైలు, జరిమానా

నూజివీడు, సెప్టెంబరు 24: చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఉయ్యూరుకు చెందిన పల్లగాని విజయ్‌కుమార్‌కు ఆరు నెలల జైలు, రూ. 3 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు ఇచ్చారు. నూజివీడుకు చెందిన దండమూడి అజయ్‌కుమార్, పల్లగాని విజయ్‌కుమార్‌కు 2018లో రూ.2 లక్షల 50 వేలు అప్పుగా ఇచ్చాడు. తరువాత బాకీ చెల్లించమని కోరగా విజయ్‌కుమార్ రూ.2 లక్షల 75 వేలు చెక్కు అజయ్‌కుమార్‌కు ఇచ్చాడు. అయితే ఆ చెక్కు చెల్లలేదు. దీంతో అజయ్‌కుమార్ కోర్టులో కేసు వేయగా, విచారణ అనంతరం న్యాయమూర్తి పలగాని విజయ్‌కుమార్‌కు జైలు, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

విద్యుదాఘాతానికి రైతు బలి

కామవరపుకోట, సెప్టెంబరు 24 : కామవరపుకోట మండలం తడికలపూడిలో ఒక రైతు తన పొలంలో కరెంటు మెయిన్ వేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నిజవరపు సత్యనారాయణ (45) అనే వ్యక్తి తన పొలంలో నీటిని వదిలేందుకు స్విచ్ వేయగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దొరకని మెడికో ఆచూకీ.. మారేడుమిల్లిలో కొనసాగుతున్న గాలింపు

మారేడుమిల్లి, సెప్టెంబరు 24: అల్లూరి జిల్లా మారేడు మిల్లి జల తరంగిణిలో ఆది వారం కొట్టుకు పోయిన మెడి కల్ విద్యార్థి చింత కుంట్ల హరదీప్ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. ఆదివారం జరిగిన ఈ దుర్ఘటన అనంతరం సహాయక చర్యలు చేపట్టిన అధికారులు సోమవారం ఇద్దరు వైద్య విద్యార్థినుల మృత దేహాలను కనుగొన్న సంగతి తెలిసిందే. మరో విద్యార్థి ఆచూకీ కోసం మంగళవారం కూడా ఎస్‌డీ ఆర్‌ఎఫ్ బృందాలతో కొండవాగులు, కల్వర్టులు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థి జాడ కన్పించక పోవడంతో రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి డ్రోన్ కెమెరాను వినియోగిస్తూ జల్లెడ పడుతున్నారు. జల తరంగిణి నుంచి నీటి ప్రవాహం పలు కల్వర్టులు, దట్టమైన పొదల మీదుగా ప్రవహిస్తూ పాములేరు వాగులోకి అక్కడి నుంచి గోదావరి నదిలోకి నీటి ప్రవాహం చేరుకొనే అవకాశం ఉండడంతో ఆ దిశగా గాలింపు చేపట్టారు. ఎన్‌డీఆర్‌ఎఫ్‌తో పాటు ప్రత్యేక బృందం డ్రోన్ కెమెరా సాయంతో పాములేరు వాగులో కొన్ని కిలోమీటర్ల మేర గాలింపు చేపట్టింది మంగళవారం బాగా చీకటి పడడంతో పాములేరు వాగు ప్రమాదకరంగా ఉండడంతో తిరిగి బుధ వారం గాలింపు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.




తామరకొల్లులో 'పొలం పిలుస్తోంది'లో అధికారులు, రైతులు


శ్రీహరిపురంలో పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ


పడమటిపాలెంలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న అధికారులు

తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడులే లక్ష్యం

'పొలం పిలుస్తోంది'లో వ్యవసాయాధికారులు

కైకలూరు, సెప్టెంబర్ 24: వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టినట్లు మండల వ్యవసా యాధి కారిణి ఆర్. దివ్య అన్నారు. మంగళవారం కైకలూరు మండలం తామరకొల్లు, వింజరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహించి వ్యవసాయంలో సాంకేతిక సమాచారాన్ని రైతులకు అందించడం, సాగుపై చర్చించి రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులను వివరించడం జరుగుతుందన్నారు. పంటలపై అవగాహన కల్పించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా ప్రోత్సహించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సర్పంచ్‌లు భట్రాజు శివాజీ, కట్టా నాగరాజు గౌడ్, ఎంపీటీసీ బుర్ల నాగరాజు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి భవిత, మాజీ సర్పంచ్ మీగడ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

ముదినేపల్లి: వరి సాగులో రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని మండవల్లి ఏడీఏ జి.వెంకటమణి కోరారు. ముదినేపల్లి మండలం వడాలి, సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎరువుల యాజమాన్య పద్ధతులను విధిగా పాటించాలని కోరారు. శ్రీహరిపురంలో పోస్టర్‌ను ఏవో వేణుమాధవ్, సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ఆవిష్కరించారు. వడాలిలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల పశువైద్యాధికారి క్రాంతికుమార్, గ్రామ టీడీపీ నాయకులు గురువు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు.

కలిదిండి: మండలంలోని లోడిదలంక, పడమటి పాలెం గ్రామాల్లో వ్యవసాయ, మత్స్యశాఖాధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు కొత్త యాజమాన్య పద్ధతులు, డ్రోన్‌ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులు మాట్లాడుతూ పెదలంక డ్రెయిన్‌లోకి ముందస్తుగా ఉప్పునీరు రావటంతో చేపల చెరువుల పెంపకం కష్టతరమవుతుందన్నారు. తీపి నీరు లేకపోవటంతో చెరువులు చౌడు బారుతున్నాయని గిరిశపూడి అండర్ టన్నెల్ వద్ద రెగ్యులేటర్ నిర్మించాలని కోరారు. స్పందించిన వ్యవసాయ, మత్స్యశాఖాధికారులు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్, పశువైద్యాధికారి ప్రహర్ష; పడమటిపాలెం సర్పంచ్ సరస్వతీ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.95 లక్షల విరాళాలు


సీఎం చంద్రబాబుకు విరాళాల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, సెప్టెంబరు 24: వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ రూ.95 లక్షల విరాళాల చెక్కును సీఎం చంద్ర బాబుకు అందజేశారు. మంగళవారం అమరావతిలో సీఎంను కలసి చెక్కును అంద జేశారు. ఈ విరాళాలను కైకలూరు నియోజకవర్గం లోని చేపల రైతులు, ఎన్డీయే నాయకులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, పలువురు వ్యాపారులు, సొసైటీ సభ్యులు, విద్యార్థులు, విద్యా సంస్థలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, స్వయం సహాయక సంఘాలతో పాటు అనేక గ్రామాల సర్పంచ్‌లు అందించిన విరాళాలుగా ముఖ్యమంత్రికి వివరించారు. విరాళాలను అందించడం అభినందనీయమని ముఖ్యమంత్రి కైకలూరు నియోజకవర్గ ప్రజలకు అభినందనలు తెలిపినట్లు కామినేని వెల్లడించారు.

చింతపాడు హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం



మండవల్లి, సెప్టెంబ రు 24: చింతపాడు జడ్పీ హైస్కూల్లో మంగళవారం ఉపాధ్యా య దినోత్సవం నిర్వహించారు. సెప్టెంబరు 5న భారీ వర్షాల కార ణంగా ఈ పాఠశాల ముంపునకు గురి కావడంతో మంగళవారం నాడు నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సాంస్కృతిక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో జనసేన, బీజేపీ ప్రాయశ్చిత్త దీక్ష

కలిదిండి, సెప్టెంబరు 24 : తిరుమల లడ్డూ అపవిత్రతపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మంగళవారం కలిదిండి రాజలింగేశ్వరస్వామి ఆలయంలో జనసేన, బీజేపీ నాయకులు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్రమైన శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి కలపి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కో-కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు, బీజేపీ నాయకులు చిట్టూరి రవీంద్ర, పన్నాస పూర్ణచంద్రరావు, గుండ్రాల అయ్యప్ప, సాన సరస్వతీ, సతీష్, పులివెంకన్న, తోట స్వాతి తదితరులు పాల్గొన్నారు.



గొర్రెల కాపరుల సంక్షేమానికి కృషి

ముసునూరు, సెప్టెంబరు 24: గొర్రెలకాపరుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎంపీపీ మసిముక్కు సుబ్బారావు, టీడీపీ సీనియర్ నాయకులు కొల్లి గంగారామ్ అన్నారు. మంగళవారం గుడిపాడులో సూమారు 15 మంది గొర్రెల కాపరులకు 750 కేజీ దాణా, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగారామ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు జీవాలకు కడుపునిండా మేతలేక బక్కచిక్కి వ్యాధులు సోకడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. దీంతో ప్రభుత్వం గొర్రెల కాపరులకు అండగా పోషక విలువలతో కూడిన దాణా, నట్టల నివారణ మందు, వ్యాక్సిన్ ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. రాజబోయిన శ్రీనివాసరావు, రైతులు, వెటర్నరీ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సారథి

రూ. 297 కోట్లతో రహదారుల అభివృద్ధి

వర్షాలు పూర్తిగా తగ్గాక పనులు : మంత్రి సారథి

ఆగిరిపల్లి, సెప్టెంబరు 24: దెబ్బతిన్న రహదారులను రూ. 297 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలంలో రూ. 35.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులకు మంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. సగ్గూరులో రూ. 8.5 లక్షలతో యాదవుల బజారు వద్ద, కొమ్మూరులో రూ. 12.05 లక్షలతో, వట్టిగుడిపాడులో రూ. 14.55 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులకు మంత్రి సారథి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని, గోతుల రోడ్లతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వర్షాలు పూర్తిగా తగ్గిన తరువాత రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను అభివృద్ధి చేస్తామని మంత్రి అన్నారు. నూజివీడు ఆర్డీవో వై.భవాని శంకరి, రహదారులు, భవనాల శాఖ ఎస్‌ఈ జాన్‌మోషే, ఉద్యానవన శాఖ డీడీ రామ్మోహన్, తహసీల్దార్ టి.ఎన్.వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు

ముదినేపల్లి, సెప్టెంబరు 24 : ముదినేపల్లి మండలంలో రెవెన్యూ శాఖలో ఉద్యోగుల బదిలీలు భారీగా జరిగాయి. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ గుడ్లవల్లేరు మండలానికి బదిలీ కాగా, 15 మంది వీఆర్వోలకు కూడా స్థాన చలనం కలిగింది. పెదపాలపర్రు వీఆర్వో బాలసుబ్రహ్మణ్యంను ముదినేపల్లి -2, ముదినేపల్లి-1 వీఆర్వో కరీమ్‌ను కోడూరు, పెనుమల్లి వీఆర్వో హనుమంతరావును ముదినేపల్లి -1, అల్లూరు వీఆర్వో ఎం.పద్మావతిని వడాలి, వాడవల్లి వీఆర్వో పి.యేసుపాదంను చిగురుకోట, వైవాక వీఆర్వో కె.ఫణికుమార్‌ను వాడవల్లి, సింగరాయపాలెం వీఆర్వో పి.వెంకట్రావును పెదగొన్నూరు, చిగురుకోట వీఆర్వో కె.కిషోర్‌ను కొరగుంటపాలెం, పెదగొన్నూరు వీఆర్వో వై.ఏడుకొండలును కాకరవాడ, బొమ్మినంపాడు వీఆర్వో సుబ్రహ్మణ్యంను కైకలూరు మండలం ఆచవరం, శ్రీహరిపురం వీఆర్వో రామసుబ్బయ్యను సింగరాయపాలెం, వడాలి వీఆర్వో కె.మురళీని పెనుమల్లి, పెదపాలపర్రు వీఆర్వోగా కైకలూరు మండలం నుంచి శ్యామ్‌ను, గురజ వీఆర్వో పవన్‌ను నూజివీడు మండలం సీతారామపురం, అల్లూరు వీఆర్వోగా సీతారామపురం వీఆర్వో టి.శ్రీరాములును బదిలీ చేశారు.


ప్రమాదకరంగా మద్వానిగూడెం వంతెన అప్రోచ్ రోడ్డు

ఎదురుగా వాహనం వస్తే అంతే!

ప్రమాదకరంగా మద్వానిగూడెం వంతెన అప్రోచ్ రోడ్డు

కలిదిండి, సెప్టెంబరు 24: మండలంలో మద్వానిగూడెం వద్ద ఉప్పుటేరుపై వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. దీంతో రాత్రి పూట వాహనాలు అదుపు తప్పి పలువురు గాయాల పాలవుతున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు పక్కకు తప్పు కోవటానికి వీలు లేక గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ వంతె నపై నుంచి రాష్ట్ర రహదారి వెళ్లటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటీవల వరదలకు ఉప్పుటేరు పొంగటంతో అప్రోచ్ రోడ్డు మరింత కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. వంతెన అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా రైలింగ్ ఏర్పాటు చేయాలని ఐదేళ్లుగా పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవిం చినా పట్టించుకోలేద ని ప్రజలు ఆరోపిస్తున్నారు. వంతెన సమీపంలో దుంపల కోడు దిబ్బ గ్రామం వైపు అప్రోచ్ రోడ్డుపై అక్రమ షెడ్లులు నిర్మిం చటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మద్వాని గూడెం వంతెన అప్రోచ్ రోడ్డుకు రైలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ట్రిపుల్ ఐటీలో పనికిరాని మొక్కలు తొలగిస్తున్న విద్యార్థినులు

ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛభారత్

నూజివీడు, సెప్టెంబరు 24: ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఏసీ ఆడిటోరియం వెనుక ఉన్న పనికిరాని మొక్కలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తొలగించారు. అలాగే క్యాంపస్‌లోని వాలీబాల్ కోర్టు పరిసరాల్లో డైరెక్టర్ ఆచార్య ఎస్.అమరేంద్రకుమార్, ఏవో డాక్టర్ బి.లక్ష్మణరావు చేతుల మీదుగా విద్యార్థులు మొక్కలను నాటించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పీవీ లక్ష్మణరావు, బొత్సా శ్రీనివాసరావు, సీతాపతిరావు, సమన్వయకర్తలు శ్రావణి, కనక కుమారి ఆధ్వర్యం వహించారు.

ఆగిరిపల్లిలో భారీ వర్షం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 24: ఆగిరిపల్లి మండలంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కురిసిన వర్షం జనజీవనాన్ని పూర్తిగా స్తంభింప చేసింది. సుమారు 2 గంటల పాటు కురిసిన ఈ భారీ వర్షం రోడ్లపై కాలువలా ప్రవహించింది. 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్ తెలిపారు.

కొనకళ్లకు ఆర్టీసీ చైర్మన్ పదవిపై హర్షం

నూజివీడు, సెప్టెంబరు 24: ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ నియామకం పట్ల నూజివీడు మండల గౌడ సంఘం అధ్యక్షుడు పామర్తి వెంకట నాగేంద్రరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ పదవిని గౌడలకు కేటాయించినందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు గౌడ సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఆగిరిపల్లి ఎంపీడీవోగా భార్గవి రెడ్డి

ఆగిరిపల్లి, సెప్టెంబరు 24: ఆగిరిపల్లి నూతన ఎంపీడీవోగా భార్గవి రెడ్డి నియమితులయ్యారు. విజయవాడ రూరల్ మండలం నుంచి ఆమె ఇక్కడకు బదిలీ అయ్యారు. ఎంపీడీవోగా పనిచేసిన శంకర్‌రావు గత నెల పదవీ విరమణ పొందగా, ప్రస్తుత ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా అబ్దుల్ సలామ్ కొనసాగుతున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా భార్గవిరెడ్డి ఆగిరిపల్లి ఎంపీడీవోగా రానున్నారు.

నేటి నుంచి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చాట్రాయి, సెప్టెంబరు 24: స్వర్ణాంధ్ర-1947 పథకంలో భాగంగా 25న అన్ని పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. 'స్వర్ణాంధ్ర సాధనకు రాబోయే ఐదేళ్ళలో విద్యా రంగంలో తీసుకురావల్సిన సంస్కరణలు' అనే అంశంపై పోటీలు జరుగుతాయన్నారు. అలాగే పాఠశాల స్థాయి విజేతలకు 27న మండల స్థాయిలో, మండల స్థాయి విజేతలకు 29న జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయి విజేతలకు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్ అందిస్తారని వివరించారు.

'జీవనజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి



ముసునూరు, సెప్టెంబరు 24: ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాన్ని బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి వినియోగదారుడు సద్విని యోగం చేసుకోవాలని గోపవరం ఎస్‌బీఐ మేనేజర్ కె.రాంబాబు అన్నారు. మండలంలోని కాట్రేని పాడుకు చెందిన వెలగపూడి వెంకట్రావ్(45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు బీమా పథకానికి ప్రతి ఏటా రూ. 435లు చెల్లించడం వల్ల రూ. 2 లక్షలు బీమా పరిహారం చెక్కును నామినీగా ఉన్న ఆయన భార్యకు మంగళవారం అందజేశారు.

దూర విద్యా విధానంపై అవగాహన

ముసునూరు, సెప్టెంబరు 24: రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా విధానంపై వెలుగు వీవోఏలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, సచివాలయ ఉద్యోగులకు ముసునూరు జడ్పీ పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంఈవో సుబ్బారావు మాట్లాడుతూ మధ్యలో చదువు మానివేసిన విద్యార్థులను గుర్తించి ఓపెన్ స్కూల్‌లో పదవ తరగతిలో చేర్పాలన్నారు. అలాగే పదవ తరగతి పాస్ అయి చదువు మానివేసి విద్యార్థులను ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియట్‌లో చేర్చేలా కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం ఎ.సునీల, ఏపీఎం కె.బాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు బి.పద్మావతి, ఐసీడీయస్ సూపర్‌వైజర్ జి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కైకలూరు చిన్నచెరువుగట్టువద్ద కరపత్రాల పంపిణీ


ములకపల్లిలో పాల్గొన్న తెలుగురైతు జిల్లా అధికార ప్రతినిధి బొప్పన


చింతలవల్లిలో కరపత్రాలను అందజేస్తున్న నాయకులు, అధికారులు

అంచెలంచెలుగా.. హామీల అమలు

'ఇది మంచి ప్రభుత్వం'లో కూటమి నాయకులు

కైకలూరు, సెప్టెంబర్ 24: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అంచెలంచెలుగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం కైకలూరు చిన్నచెరువు గట్టు ప్రాంతంలోని 115, కాలువగట్టు ప్రాంతంలోని 116వ వార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ రహీం, క్లస్టర్ ఇన్‌చార్జి లక్ష్మీరాణి, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రావు, పార్టీ నాయకులు ఎండీ జానీ, వీరాబత్తిన సుధా, శీలం కృష్ణవేణి, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ములకలపల్లిలో తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి బొప్పన సుందరరామయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేసి ఎన్‌డీఏ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. అల్లూరులో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, బొమ్మినంపాడులో టీడీపీ, జనసేన నాయకులు యర్రా రాంబాబు, బాసినశెట్టి కిషోర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

కలిదిండి: కోరుకొల్లులో మంగళవారం కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వందరోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పలు పథకాల పునరుదరణ, పెన్షన్లు పెంచి 1వ తేదీనే ఇంటింటికి పంపిణీ గొప్ప విషయమన్నారు. విజయవాడ వరద బీభత్సంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం చంద్రబాబు రేయింబవళ్లు వారికి అండగా నిలిచారన్నారు. మాజీ ఎంపీపీ వలవల రామా రావు, మాజీ వైస్ ఎంపీపీ ఆమజాల బాబులు, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం, నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుగసాని వేణు, సీనియర్ నాయకుడు పాలడుగు నాగేంద్రబాబు అన్నారు. మండలంలోని చింతలవల్లి, చెక్కపల్లి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నాయకులు, అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేసి ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించారు. సీఎం చంద్రబాబు వందరోజుల పాలనలో అమలు చేసిన హామీలు, చేసిన అభివృద్ధి, భవిష్యత్‌లో కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు నాంది అని నాయకులు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చేందుకు కసరత్తు జరుగుతుందని, దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందిస్తారన్నారు. సర్పంచ్‌లు పిల్లి సత్యనారాయణ, టి. రాధికా సత్యనారాయణ, ఎంపీటీసీ పుష్పావతి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ కె. సత్యనారాయణ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.